
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
20
బుధవారం 9 ఆగస్టు 2017



సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రసవానంతరం కేసీఆర్ కిట్‌తో బాలింతలు



కేసీఆర్ కిట్.. అంతటా హిట్

- సర్కార్ దవాఖానాల్లో పెరిగిన ప్రసవాలు
- జిల్లా కేంద్ర ఆస్పత్రికి అధికంగా వస్తున్న గర్భిణులు
- తల్లీబిడ్డల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- హాస్పిటల్స్‌లో మెరుగైన సౌకర్యాల కల్పన
- ఎప్పటికప్పుడు వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీ
- పెరిగిన సాధారణ కాన్పుల సంఖ్య
- సీఎంకు సెల్యూట్ చేస్తున్న జనం

మొన్నటి వరకు సర్కారు దవాఖానా అంటే జనాలకు గుండె దడ అనేది. గర్భిణులను అక్కడికి తీసుకెళ్తే సురక్షితంగా బయటికొస్తామో లేదోననే భయం ఉండేది. నేడు అవన్నీ పటాపంచలయ్యాయి. కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకాలు అందరిలో ధైర్యాన్ని నింపాయి. ప్రభుత్వాసుపత్రుల్లోనూ ప్రసవాలు పెరిగిపోతున్నాయి. ఇందులో చాలావరకు నార్మల్ డెలివరీలే. కేసీఆర్ కిట్ ద్వారా తల్లీబిడ్డలకు ఉపయోగపడే 15 రకాల వస్తువులతో పాటు ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రభుత్వం గర్భిణులకు భరోసానిస్తోంది.

వివరాలు 4



సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కేసీఆర్ కిట్‌తో బాలింత

ప్రసవ వేదన

- కేసీఆర్ కిట్ల ప్రభావంతో జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో పెరిగిన ప్రసవాలు
- అడ్డొస్తున్న సౌకర్యాల లేమి
- గైనకాలజీ విభాగంలో సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు
- సమయపాలన పాటించని డాక్టర్లు

4 లో



5 లో

మళ్లీ రియల్ భూం

- హైదరాబాద్ శివారు గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలు
- రింగ్‌రోడ్డు పరిసరాల్లో జోరుగా సాగుతున్న రియల్ వ్యాపారం
- కొల్లూరుతో పాటు పలు ప్రాంతాల్లో పెరిగిన ధరలు
- కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటుతో బంగారమైన భూములు

పంట రుణాల విషయంలో
నిర్లక్ష్యం వద్దు

- ఇప్పటి వరకు రైతులకు కేవలం 44.5శాతం రుణాల పంపిణీ
- జాయింట్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

5

అంగన్‌వాడీకి త్వరలో
పక్కా భవనం

- సంగారెడ్డిలోని ఇంద్రకాలనీలోని కేంద్రం విషయంలో స్పందించిన అధికారులు
- ప్రత్యామ్నాయంగా మరో భవనం కేటాయింపు

4 లో

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేయండి



హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్
పలు ప్రభుత్వ పథకాలపై సమీక్ష
బతుకమ్మ పండుగ చీరల పంపిణీపై చర్చ
హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
సంగారెడ్డి నుంచి పాల్గొన్న కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్, అధికారులు

5 లో

ఇంటర్వ్యూ



ఇంత నిరంకుశత్వం ఎప్పుడూ చూడలేదు

● ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు సునీతారెడ్డి

నర్సాపూర్: ఇంతటి నిరంకుశ పాలన గతంలో ఎప్పుడూ చూడలేదని, మంత్రిని కలిసి ప్రజల సమస్యలు విన్నపించుకోకుండా నిర్బంధించి అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమని మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షురాలు సునీతారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

మిమ్మల్ని ముందస్తు అరెస్టు చేయడానికి కారణం ఏమిటి ?

మంత్రి హరీశ్‌రావు నర్సాపూర్‌కు రాఖీ పౌర్ణమి నాడు వస్తున్నందున పట్టాలు పొందిన లబ్ధిదారులతో కలిసి వెళ్లి ఆయనకు రాఖీ కట్టి వారికి న్యాయం చేయాలని కోరడానికి వెళ్తామంటే అప్రజాస్వామికంగా అరెస్టు చేయడం దారుణం.

ఆ పట్టాలన్నీ అనర్హులు, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చారని టీఆర్ఎస్ నాయకులు అంటున్నారు?

అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఆర్డీవోతో పాటు ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది అంతా కలిసి వారిని ఎంపిక చేశారు. ఇప్పుడు టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇప్పటి అధికారులు ఎలా అనర్హులుగా ప్రకటిస్తున్నారో అర్థం కావడం లేదు. లబ్ధిదారుల ఎంపికలో మేము జోక్యం చేసుకోలేదు.

కాంగ్రెస్ హయాంలో ఇళ్ల పట్టాలు ఎన్నిచ్చారు?

నర్సాపూర్‌లో 2013 సంవత్సరంలో 1370 పట్టాలిచ్చాం.

ప్రస్తుతం అదే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇస్తామంటున్నారా?

డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ కాంగ్రెస్ పట్టాలిచ్చిన వారికి అదే స్థలం కేటాయించి, కొత్త లబ్ధిదారులకు మరోచోట నిర్మించాలనేదే మా ప్రధాన డిమాండ్.

లోకాయుక్తనే అనర్హులకు పట్టాలిచ్చారని పేర్కొందని టీఆర్ఎస్ వాదన?

టీఆర్ఎస్ నాయకులు తప్పుడు సమాచారంతో లోకాయుక్తను ఆశ్రయించారు. ఇప్పటి అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లొంగి తప్పుడు నివేదికలు ఇచ్చారు.

అప్పుడు పట్టాలిచ్చిన వారిలో అర్హులకు ఇస్తామంటున్నారు ?

టీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే 1370 ఇళ్ల పట్టాల్లో అనర్హులు ఎవరో.. అందులో కాంగ్రెస్ వారు ఎవరో దమ్ముంటే బయటపెట్టాలి. కేవలం వారి రాజకీయ ప్రయోజనాల కోసం టీఆర్ఎస్ నాయకులు ఈ విధంగా చేస్తున్నారు.

మీరే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అధికార పార్టీ నాయకుల ఆరోపణ?

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లయింది. ఇప్పటి వరకు వారు నియోజకవర్గానికి ప్రత్యేకంగా చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పమనండి. కాంగ్రెస్ హయాంలో మంజూరైన నిధులతో నిర్మించిన వందపడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల తదితర వాటిని తాము చేశామంటు చెప్పుకుంటున్నారు. నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి కూడా నిధులు నా హయాంలో మంజూరైనా ప్రజాప్రతినిధులు భవనం నిర్మించలేకపోతున్నారు.

నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి ఏవిధంగా ఉంది ?

చాలా బలంగా ఉంది. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు ఎందరో ఉన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి?

టీఆర్ఎస్ మాయమాటలతో అధికారంలోకి వచ్చిందే తప్ప ఎన్నికల హామీ ఒక్కటి కూడా అమలు కావడంలేదు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం. టీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కాంగ్రెస్ అన్ని నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై పోరాడుతోంది.

బొప్పాయితో బోలెడు లాభాలు

● 15 ఏళ్లుగా సాగు చేస్తున్న గుండప్ప ● తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ● ప్రోత్సాహం కోసం ఎదురు చూపు

వ్యవసాయం చేయడమంటేనే ఏటికి ఎదురీదడం అన్నట్లుగా పరిస్థితులు మారుతున్న ఈ రోజుల్లో 15 ఏళ్ల నుంచి బొప్పాయి తోటను సాగు చేస్తూ రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు కంగ్టి మండలంలోని భీంరా గ్రామానికి చెందిన మాలేకర్ గుండప్ప - కంగ్టి



కంగ్టి మండలంలోని భీంరా గ్రామానికి చెందిన మాలేకర్ గుండప్ప బొప్పాయిపై మక్కువతో 15 సంవత్సరాలుగా సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండలంలో సాగవుతున్న బొప్పాయి తోట ఇదొక్కటే కావడంతో లాభాలు సైతం బాగానే వస్తున్నాయంటున్నాడు. సదరు రైతు మార్కెట్లో లభిస్తున్న ప్రతి పండు రసాయనాల వాడకంతో కలుషితమౌతున్న ఈ రోజుల్లో ప్రకృతి సిద్ధంగా కాసిన ఫలాలనే ప్రతిరోజూ కోస్తూ సమీప మార్కెట్లలో అమ్ముతుండడంతో ఆయన అమ్మే బొప్పాయి పండ్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతుంటాయి. గుండప్ప తనకున్న ఐదెకరాల్లో ఒక ఎకరా బొప్పాయి సాగు చేయగా మరో ఎకరాలో వంకాయ, మిరప ఇతర కూరగాయలు సాగు చేస్తున్నాడు. బొప్పాయితో మంచి దిగుబడులు సాధించేందుకు గుండప్ప మహారాష్ట్రలోని పుణె నుంచి నాణ్యమైన విత్తనాలను పోస్టు ద్వారా తెప్పించుకుంటాడు. గుండప్పపై పుణేలోని విత్తన వ్యాపారులకు పూర్తిగా నమ్మకం పెరగడంతో ఆయన కోరిన వెంటనే వారు విత్తనాలను పోస్టు ద్వారా పంపిస్తుంటారు. రూ.4 వేలకు తులం చొప్పున బొప్పాయి విత్తనాలు లభిస్తుండడంతో 2 నుంచి 3 తులాలు విత్తనాలు తెప్పించుకుని ఎకరాలో నాటుతుంటాడు. ఒక తులానికి 3 వందల విత్తనాలు లభిస్తుండడంతో ఎకరాకు 7 వందల విత్తనాలు నాటుతున్నాడు. 5 నెలల అనంతరం అంతర పంటలుగా స్వల్పకాలంలో చేతికొచ్చే టమాట, వంకాయ వంటి కూరగాయలు సాగు చేసి బొప్పాయికి అవసరమయ్యే పెట్టుబడిని వీటి ద్వారానే పొందుతూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. నాటిన ఏడాదికి కాతకు వచ్చే బొప్పాయి ప్రతి మూడు నెలలకోమారు రసాయన ఎరువులు వేస్తున్నాడు. ఇలా ఒక సారి నాటిన బొప్పాయి చెట్టు 3 సంవత్సరాల వరకు ఫలాలనిస్తుందని రైతు గుండప్ప తెలిపాడు. తక్కువ పెట్టుబడితో బొప్పాయిలో అధిక లాభాలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నాడు. ఒక్కో చెట్టుకు 2 వందల నుంచి 3 వందల వరకు కాయలు కాస్తుంటాయని పరిస్థితులను బట్టి కిలో బొప్పాయిని రూ.20 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తానని ఆయన అన్నారు. విత్తనాలు నాటడంతో మొదలుకొని నీరు పెట్టడం, కలుపు తీయడం, చివరకు కోసిన బొప్పాయి పండ్లను స్వంత ఆటోలో మార్కెట్లకు తరలించి విక్రయించడం గుండప్ప కుటుంబీకులే చేస్తుండడం విశేషం. ఇలా పండిన పండ్లను ఏ రోజు మార్కెట్‌కు వెళ్లాల్సి ఉంటే అదే రోజు తాజా పండ్లను తెంపి తరలిస్తుంటాడు. కంగ్టితో పాటు తడ్కల్, పిట్లం, నారాయణఖేడ్, ఔరాద్, జమ్గి మార్కెట్లలో అమ్ముతుంటాడు. బొప్పాయిపై నమ్మకంతో 15 ఏళ్లుగా లాభాలు గడిస్తున్నాడు గుండప్ప.

ప్రభుత్వ సహాయం అందడం లేదు



పండ్లతోటలు సాగు చేస్తే సర్కారు సబ్సిడీ ఇస్తదని విన్నాకాని నాకు ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పరికరాలు కూడా నాకు అందలేదు. చదువుకోని నాకు డబ్బులు కడితే అధికారులు డ్రిప్ ఇస్తారో లేక సతాయిస్తారోనని భయపడి ధరఖాస్తు పెట్టలేదు. దీంతో కష్టమైనా నేనే పారతో నీరు పారబెడుతున్నాను. సర్కారు సాయం చేస్తే బొప్పాయి తోట మరింత ఎక్కువగా సాగు చేసుకుంటా.

- గుండప్ప





బొప్పాయి చెట్లకు ఏపుగా కాసిన కాయలు, తోట పక్కనే గుండప్ప సాగు చేస్తున్న మిరప, సోయా పంటలు

ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

● తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి భీంరావు

ఉద్యోగపర్వం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలి. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్లతో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. వాటికి అనుగుణంగా ప్రభుత్వాసుపత్రుల్లో నర్సింగ్, సహాయ సిబ్బందిని అదనంగా నియమించాలి. ప్రభుత్వాసుత్రుల్లోని ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి. ఆసుపత్రులకు వస్తున్న రోగుల సంఖ్యను బట్టి పడకల సంఖ్యను పెంచాలి. ఆస్పత్రుల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయాలి.

- సదాశివపేట రూరల్

తులసి చెట్టుకు పూజ చేస్తే అన్నీ శుభాలే

● పురోహితులు కృష్ణశర్మ

భక్తి



ఉదయం నిద్ర నుంచి లేచిన వెంటనే ముందుగా తులసి చెట్టును చూస్తే ముల్లోకాల్లోని సకల తీర్థాలను దర్శించిన పుణ్యం కలుగుతుంది. తులసి చెట్టు మనుషులను, ఇంటి వాతావరణాన్ని పవిత్రంగా చేస్తుంది. ఈ చెట్టు ఎంతో పుణ్యఫలం ప్రసాదిస్తుంది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలుగజేస్తుంది. తులసి కోటను లేదా చెట్టును ప్రతినిత్యం భక్తి శ్రద్ధలతో పూజించి నీళ్లుపోయాలి. ప్రదక్షిణ చేసి నమస్కరించాలి. తద్వారా అశుభాలన్నీ తొలగి సకలశుభాలు చేకూరుతాయి. మనోభీష్టాలన్నీ నెరవేరతాయి. తులసి వనాన్ని కలిగిన ఇల్లు పుణ్యతీర్థంతో సమానమైనదని అనేక పురాణాలు, శాస్త్రాల్లో పేర్కొనబడింది. తులసి పూజ ముఖ్యంగా స్త్రీలకు సుఖసౌభాగ్యాలను కలిగిస్తుంది. ఉదయం, సాయంకాలం తులసి కోట వద్ద దీపారాధన చేయడం వల్ల మిక్కిలి మంగళప్రదంగా ఉంటుంది. ఇంటి ఆవరణలో తులసి చెట్టు ఉంటే చాలు క్షుద్రశక్తుల ప్రయోగాలు కూడా నీరుగారిపోతాయి.

- సంగారెడ్డి

శతాధిక వృద్ధురాలి మృతి

మనోహరాబాద్ (తూప్రాన్): మెదక్ జిల్లా కాళ్లకల్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చెందిన నేతికుంట మల్లమ్మ(104) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఇప్పటి వరకు మల్లమ్మ తన పను లు తానే చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 3రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆమె మంగళవారం మృతిచెందింది.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.** పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

\- మేనేజర్

సంగారెడ్డికి కొత్త అందాలు

• శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు • ఆకర్షణీయంగా సెంట్రల్ లైట్లు

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పట్టణ సమీపంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి పాత బస్టాండ్, మహబూబ్‌సాగర్ చెరువు కట్ట వరకు రోడ్డు విస్తరణతో పాటు డివైడర్, ఇరు వైపులా ఫుట్‌పాత్‌లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సెంట్రల్ బట్టర్‌ఫ్లై లైటింగ్ పను లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణతో సంగారెడ్డి పట్టణంలో కొత్త అందాలు సంతరించుకుంటున్నాయి. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ద్వారా రూ.14.25 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. సంగారెడ్డి గ్రేడ్‌వన్ మున్సిపాలిటీ హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నందువల్ల రోడ్డు విస్తరణను ఆ శాఖ ఆధ్వర్యంలోనే ఈ పనులను చేపడుతున్నారు. ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడం వల్ల రోడ్డు పై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా యి. పట్టణ శివారుల నుంచి బైపాస్ రోడ్లు కూడా సక్రమంగా లేకపోవడంతో బెంగుళూర్, హైద్రాబాద్ నుంచి నాందే డ్, అకోలా వైపునకు వెళ్లే భారీ వాహ నాలు సైతం పట్టణంలో నుంచి వెళ్లాల్సి వస్తున్నది. పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి పాత బస్టాండ్ సమీపంలోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టవరకు రోడ్డు ఇరు కుగా ఉండి, రెండువైపులా మురుగు కాల్వల లైన్ ఇండ్లను, దుకాణాలను నిర్మించారు. దాంతో ట్రాఫిక్ ఇబ్బందు లు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రాల్లో రోడ్డు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన నేపథ్యంలో సంగారెడ్డిలో రోడ్డు విస్తరణ కోసం హెచ్ఎండీఏ నుంచి రూ.14.25 కోట్లు విడుదల చేశారు. ఈ రోడ్డు విస్తరణ ప నులను ఫిబ్రవరి 20న మంత్రి కేటీఆర్, జడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో రూ.6.50 కోట్లతో ఇరువైపులా రోడ్డు విస్తరణతో పాటు మధ్యలో 5 ఫీ ట్ల డివైడర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రూ.1.07 కోట్లతో డివైడర్ పనులు,మరో రూ.6.68 కోట్లతో సెంట్రల్ లైటింగ్, ఇ రువైపులా ఫుట్‌పాత్‌లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే సంగారెడ్డి కొత్త హంగులతో రూపుదిద్దుకోనున్నది.



సంగారెడ్డిలో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైట్‌లు

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

పాపన్నపేట: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సందీప్‌రెడ్డి కథనం మేరకు.. నాగ్సాన్‌పల్లికి చెందిన ఎర్రచాకలి ప్రవీణ్(22) అప్పుల బాధ తాళలేక సోమవారం 3గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేస్తున్నాడు. ఈ విషయాన్ని మృతుని తమ్ముడు గమనించి చుట్టు పక్కల వారికి తెలిపాడు. మృతుడి తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిపారు. వారు వచ్చేంత వరకు శవాన్ని భద్రపరచడానికి మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతుని తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుని మరణంపై ఊహాగానాలు తలెత్తడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

అయ్యోపాపం పసికూన

• ఆడపిల్ల అని ముళ్లపొదల్లో పడేసిన తల్లిదండ్రులు
• బాలసదన్‌లో అప్పగింత

కొండాపూర్: ఏళ్లు గడిచినా, నూ టొక్క దేవుళ్లకు మొక్కినా ఈ రోజుల్లో బిడ్డలు పుట్టడం లేదు. దేవుడి కరుణా కటాక్షాలతో పుట్టిన బిడ్డను ఆడ పిల్ల అనే నెపంతో ఓ కసాయి తల్లిదండ్రులు వారం రోజులు గడవక ముందే ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిపోయారు. మండల పరిధిలోని మారేపల్లి, సైదాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఓ ముళ్ల పొదల్లో అభం శుభం తెలియని ఆడ శిశువు కేకలు వినిపించాయి. దారిన పోయే ఓ వ్యక్తి అరుపులను గ మనించి పసికూన ఉందని స్త్రీ శిశు సం క్షేమ శాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. దాంతో ఆ శాఖ అధికారులు 108కు సమాచారం ఇచ్చి హుటాహుటిన శిశువున్న చోటుకు వెళ్లారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి రేణుకా పటేట్, సూపర్‌వైజర్లు జ్యోతి, మీరాబాయి, ఏఎస్ఐ రజాక్ ఆ శిశువును తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి బాలసదన్‌కు తీసుకెళ్లారు.



పసికందుతో బాలసదన్ అధికారులు

తోపుడు బండి వ్యాపారి ఆత్మహత్యాయత్నం

• కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునే యత్నం
• వ్యాపారానికి స్థలం చూపాలంటూ డిమాండ్

జోగిపేట: ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఓ తోపుడు బండి వ్యాపారి ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన జోగిపేట పట్టణంలో మంగళవారం చోటుచేసుకున్నది. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న తోపుడు బండ్లను నగర పంచాయతీ వారు తొలగించారు. తిరిగి వారు పాత స్థలంలోనే బండ్లను పెట్టుకోగా, పోలీసులు వచ్చి బలవంతంగా తొలగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం బత్తిని మల్లేశం అనే తోపుడు బండి వ్యాపారి, సాయంత్రం నగర పంచాయితీ కార్యాలయం వద్దకు వచ్చి తన వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకున్నాడు. అనంతరం అలాగే కమిషనర్ దేవేందర్ ఛాంబర్‌లోకి వెళ్ళి ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆయనను బెదిరించాడు. తాను కొన్ని ఏళ్ళుగా ప్రధాన రహదారిపైనే తోపుడు బండి పెట్టుకునివ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని కమిషనర్‌తో అన్నాడు. ఇప్పుడు అర్ధాంతరంగా తన తోపుడు బండిని తొలగించడంతో తన కుటుంబం రోడ్డున పడిందని, ఈ పరిస్థితుల్లో తనకు ఆత్మహత్య తప్ప శర ణ్యం లేదని కమిషనర్‌తో మొరపెట్టుకున్నాడు. కమిషనర్ దేవేందర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని బుధవారం పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఆత్మ హత్యా యత్నానానికి ఒడిగట్టనని తనకు మాట ఇవ్వాలని బాధితుడిని కోరడంతో, మల్లేశం తన ఆత్మహత్యా యత్నాన్ని విరమించుకున్నాడు. దీంతో బల్దియా కమిషనర్, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



ఒంటిపై కిరోసిన్ పోసుకుంటున్న మల్లేశం

అంగన్‌వాడీకి త్వరలో
పక్కా భవనం

- సంగారెడ్డిలోని ఇంద్రకాలనీలోని కేంద్రం విషయంలో స్పందించిన అధికారులు
- ప్రత్యామ్నాయంగా మరో భవనం కేటాయింపు



నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి మోతి

సంగారెడ్డి అర్బన్ : ఎట్టకేలకు అంగన్‌వాడీ చిన్నారుల సమస్యలు పరిష్కారం కానున్నాయి. సంగారెడ్డిలోని ఇంద్రకాలనీలో ఇరుకు గదిలో సమస్యల నడుమ కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. 'చిన్నారులకు తప్పని పాట్లు' అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జాయింట్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ఆదేశాలతో ఐసీడీఎస్ అధికారులు ఇంద్రకాలనీలో ఇరుకు గదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం-2ను సందర్శించారు. జిల్లా సంక్షేమాధికారి మోతి, ఐసీడీఎస్ డైరెక్టర్ లక్ష్మీ కేంద్రంలో చిన్నారులు పడుతున్న ఇబ్బందులను అంగన్‌వాడీ టీచర్ సుజాతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ ఉదయశ్రీతో ఐసీడీఎస్ అధికారులు చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రం భవనం కేటాయింపు కోసం మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేస్తే ఎమ్మెల్యే నిధులతో నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. ప్రత్యామ్నాయంగా పక్కనే ఉన్న మరో గదిలోకి వెంటనే కేంద్రాన్ని మార్చాలని ఆదేశించారు. సీడీపీవో రేణుక, సూపర్‌వైజర్ లోపాముద్ర, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

- జిల్లా సంక్షేమాధికారి మోతి

జహీరాబాద్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని జిల్లా సంక్షేమాధికారి మోతి అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జహీరాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. బిడ్డకు భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం కూడా పిల్లలకు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. తల్లిపాల ప్రాధాన్యతను తెలిపే వారోత్సవాలను అంగన్‌వాడీ టీచర్లు విధిగా కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. అనంతరం సాముహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. రీజనల్ ఆర్గనైజర్ లక్ష్మి, సీడీపీవో సుభద్ర, సూపర్‌వైజర్లు అంజమ్మ, చంద్రమణి, తులసి, శ్యామల, పద్మ, రిజ్వానాబేగం, శశికళ, సునీతా, సువర్ణ పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో డీపీవో పర్యటన



పట్టణంలో సమస్యలను తెలుసుకుంటున్న డీపీవో వెంకటేశ్వర్లు

నారాయణఖేడ్ : నారాయణఖేడ్ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిశీలించడానికి జిల్లా పంచాయతీ అధికారి మంగళవారం ఉదయం నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొందని, పారిశుధ్యం లోపించిందని ఉప సర్పంచ్ నజీబ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు డీపీవోకు ఫిర్యాదు చేయడంతో ఆయన ఇక్కడికి వచ్చారు. శెట్కార్ థియేటర్ వీధితో పాటు ఎంపీపీ పరిసరాలు, బుడగ జంగాల కాలనీ, చాంద్‌ఖాన్‌పల్లి, మంగల్‌పేట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏ ర్పాటు చేసి పట్టణ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉప సర్పంచ్ నజీబ్ ఎంపీటీసీ రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాసిత్, వార్డు సభ్యులు దుర్గయ్య, మారుతిరావు, హన్మయ్య, వెంకమ్మ, లక్ష్మి, సిద్దికాబేగం పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్.. అంతటా హిట్



- సర్కార్ దవాఖానాల్లో పెరిగిన ప్రసవాలు
- జిల్లా కేంద్ర ఆస్పత్రికి అధికంగా వస్తున్న గర్భిణులు
- తల్లీబిడ్డల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సంగారెడ్డి అర్బన్ : మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. సర్కారు దవాఖానాల్లోనే వందశాతం కాన్పులయ్యేలా చూడాలనే ఆలోచనతో ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ల పంపిణీ అన్ని వర్గాల ప్రజల ఆదరణను పొందుతుంది. దవఖానల్లో ప్రసవాల సంఖ్య పెరగడంతోపాటు సిజేరియన్లు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. కేసీఆర్ కిట్ల ద్వారా అందించే వస్తువులు నవజాత శిశువులకు. తల్లికి కూడా ఉపయోగపడేలా ఉంటున్నాయి.

కేసీఆర్ కిట్‌తో పెరిగిన ఆదరణ

కేసీఆర్ కిట్ల పంపిణీ జిల్లాలో జూన్ 3న ప్రారంభమైంది. ఈ పథకానికి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేందుకు మారుమూల గ్రామాల్లోని గర్భిణులు సైతం ఆసక్తి చూపుతున్నారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణుల సమాచారాన్ని సేకరిస్తున్న వైద్య సిబ్బంది వారి వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.

పెరుగుతున్న ప్రసవాలు

సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ప్రసవాలు క్రమంగా పెరుగుతున్నాయి. జిల్లాలో 30 పీహెచ్‌సీలు, 4 సీహెచ్‌సీలు, 2 ఏరియా ఆస్పత్రులున్నాయి. కేసీఆర్ కిట్ల ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో 10 శాతం ప్రసవాలు పెరిగాయి.

ప్రసవాల వివరాలు

జిల్లాలో పీహెచ్‌సీలో ఏప్రిల్‌లో 281, మేలో 240, జూన్‌లో 290, జూలైలో 300 ప్రసవాలు అయ్యాయి. అలాగే సీహెచ్‌సీలో ఏప్రిల్‌లో 130, మేలో 108, జూన్‌లో 91, జూలైలో 128 ప్రసవాలు నమోదయ్యాయి. ఏరియా ఆస్పత్రుల్లో ఏప్రిల్‌లో 162, మేలో 169, జూన్‌లో 278, జూలైలో 330 ప్రసవాలు, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏప్రిల్‌లో 317, మేలో 342, జూన్‌లో 306, జూలైలో 335 ప్రసవాలు నమోదయ్యాయి. అయితే గతంతో పోల్చితే జూన్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతూ వస్తుంది.

మెరుగవుతున్న ఆస్పత్రులు

మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ పథకం అమలు కోసం సర్కార్ ఆస్పత్రులను బలోపేతం చేసే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. ఇటీవలే సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రాంగణంలో రూ.20కోట్లతో 150 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. కేంద్రంలో అవసరమైన వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేశారు. కేసీఆర్ కిట్ పేరుతో అమలవుతున్న అమ్మఒడి పథకం కారణంగా ప్రసూతి సేవలు అందించే పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు పెరుగుపడుతున్నాయి.

నగదుతోపాటు 15 వస్తువులు

తల్లీబిడ్డ ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే 15 వస్తువులను కేసీఆర్ కిట్ పేరుతో అందిస్తున్నారు. ఇందులో తల్లికి ఉపయోగపడే వస్తువులు నాలుగు ఉండగా మిగతావి శిశువుకు సంబంధించినవి ఉంటాయి. దాదాపు రూ.2వేల విలువ చేసే కిట్‌లో దోమ తెర, బేబీ మస్కిటో, డ్రస్సులు, 2 టవల్స్, బేబీ న్యాప్‌కిన్స్, జాన్సన్ బేబీ పౌడర్, బేబీషాంపు, బేబీ సోప్, బేబీ ఆయిల్, ఆట వస్తువులు, తల్లికి సంబంధించిన రెండు చీరలు, రెండు సబ్బులు, ప్లాస్టిక్ బకెట్, కిట్‌బ్యాగ్ అందిస్తున్నారు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను అమ్మఒడి (102) సిబ్బంది వాహనంలో తీసుకెళ్లి ఇంటి దగ్గర వదిలి వెళ్తారు.

కేసీఆర్ కిట్ బాగుంది



కేసీఆర్ కిట్ చాలా బాగుంది. గతంలో దవఖానకు వస్తే పట్టించుకునే వారు లేరు. కే సీఆర్ కిట్ వచ్చిన తర్వాత దగ్గరుండి చూసుకుంటున్నారు. గర్భిణుల విషయంలో ప్రత్యేక దృష్టి చూపిస్తున్నారు.

- లత, బ్రాహ్మణపల్లి

ప్రసవాలు పెరిగాయి



కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 10 శాతం ప్రసవాలు పెరిగాయి. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలి.

- రాజుగౌడ్, జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్

సాధారణ ప్రసవాలపై దృష్టి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో కే సీఆర్ కిట్ పథకం ప్రారంభం త ర్వాత సాధారణ ప్రసవాలు 62నుంచి 70శాతం పెరిగాయి. ముఖ్యంగా సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరిగింది. అందరి సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. **- గాయత్రీదేవీ, మాతా శిశు సంరక్షణ అధికారి**

వాహనంలో ఇంటికి తీసుకెళ్తున్నారు



రెండో ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చాను. గతంలో ఇదే ఆస్పత్రిలో డెలివరీ చేసుకున్నాను. ఈ సారి డెలివరీ విషయంలో సిబ్బంది ప్రత్యేకంగా పట్టించుకుంటున్నారు. సమయానికి పౌష్టికాహారం, డబ్బులతో పాటు తల్లీబిడ్డలకు సామగ్రి ఇవ్వడం ఆనందంగా ఉంది.

- జ్యోతి, మామిడిపల్లి

సర్కార్ దవాఖాన వైపే మొగ్గు



కేసీఆర్ కిట్‌తో ప్రజలు సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేయించుకునేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. గతంతో పోల్చితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగింది. కేసీఆర్ కిట్ల పంపిణే ఇందుకు కారణం.

- మోజీరాంరాథోడ్, జిల్లా వైద్యాధికారి

ప్రసవ వేదన

- కేసీఆర్ కిట్ల తో జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో పెరిగిన ప్రసవాలు
- దవాఖానాలో సౌకర్యాల లేమి

జహీరాబాద్: స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ గర్భిణులు నిత్యం ఇబ్బందులుపడుతున్నారు. ప్రభుత్వం కేసీఆర్ కిట్ల పంపిణీ ప్రారంభించనప్పటి నుంచి ఆస్పత్రికి వచ్చే గర్భిణుల సంఖ్య పెరిగింది. జహీరాబాద్‌తో పాటు డివిజన్‌లోని కోహీర్, ఝురాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్ మండలాల పరిధిలోని గర్భిణులు ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు.


గైనకాలజీ విభాగంలో సిబ్బంది కొరత

గైనకాలజీ విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ విభాగంలో కేవలం ముగ్గురు డాక్టర్లు, ఒక అనస్థీషియా డాక్టర్, ముగ్గురు నర్సులు, ఒక ఆయా మాత్రమే ఉన్నారు. ఆస్పత్రి కర్నాటకకు సరిహద్దులో ఉండడంతో నెలకు సగటున 300 పైగా గర్భిణులు ఇక్కడ ప్రసవాల కోసం వస్తున్నారు. దీంతో ఉన్న కొద్దిపాటి సిబ్బందికి పనిభారం పెరుగుతోంది. ఈ విభాగంలో 50మంది గర్భిణులకు ఒక్క డాక్టర్ చొప్పున మొత్తం ఐదుగురు వైద్యులు, ఇద్దరు అనస్థీసియాలు, మరో ఐదుగురు నర్సులు, ఇద్దరు ఆయాలు అవసరమని ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సునీల్ తెలిపారు. ప్రసవాల కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరతతో పాటు మౌలిక వసతులు సరిగ్గా లేవు. ఇక కొందరు సిబ్బంది డబ్బులు కూడా డిమాండ్ చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

సమయపాలన పాటించని డాక్టర్లు

గైనకాలజీ విభాగానికి ముగ్గురు డాక్టర్లను కేటాయించినప్పటికీ వారు సమయపాలన పాటించడం లేదు. డాక్టర్లు ఆస్పత్రికి వచ్చేలోపు గర్భిణుల ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోంది. అలాగే ఇక్కడ మెరుగైన సదుపాయాలను లేవనే సాకుతో డాక్టర్లు ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం



ప్రభుత్వాస్పత్రిలోని గైనకాలజీ విభాగంలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక పంపాం. ఆ విభాగంలో సిబ్బంది కొరత ఉండడంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతుంది. ఆస్పత్రిలో నెలకు సగటున 150ప్రసవాలు చేయాల్సి ఉంది. కేసీఆర్ కిట్లతోనే ఆస్పత్రికి వచ్చే గర్భిణుల సంఖ్య అధికమైంది. సాధారణ ప్రసవాలను చేసేందుకు వైద్యులు కృషి చేస్తున్నారు.

- డా.సునీల్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

మళ్లీ రియల్ భూం

- హైదరాబాద్ శివారు గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలు
- రింగ్‌రోడ్డు పరిసరాల్లో జోరుగా సాగుతున్న రియల్‌వ్యాపారం
- కొల్లూరుకు సాఫ్ట్‌వేర్ కలతో పెరిగిన ధరలు
- కొత్త పారిశ్రామిక వాడల ఏర్పాటుతో బంగారమైన భూములు



నియోజకవర్గం పరిధిలోని ఓఆర్‌ఆర్

పటాన్‌చెరు: హైదరాబాద్ మహానగరంలో సగభాగం, మరో సగభాగం సంగారెడ్డి జిల్లాలో కలిసి ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. మహానగరంలో సమ్మిళితలమై ఉన్న నియోజకవర్గంలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో ఇటీవల కాలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ఉద్యమాలు, ఆర్థికమాంధ్యం తదితర కారణాలతో కుదేలైన రియల్‌ఎస్టేట్ వ్యాపారం తెలంగాణా ఏర్పాటు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటుంది. ఎలాంటి అలజడి లేకపోవడంతో పెట్టుబడులకు స్వర్గధామంలా తయారైంది. తాజాగా పలు గ్రామాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక కారణం చేత అభివృద్ధికి ఆస్కారం కనిపిస్తుండడంతో రియల్ వ్యాపాస్థులు మంచి జోష్‌లో భూములు కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు. రియల్ వ్యాపారం ఇంతలా పుంజుకోవడానికి అనేక కారణాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. హైదరాబాద్ మహానగరానికి ఆనుకుని ఈ ప్రాంతం ఉండటం ఒక కారణం. దీంతో పటాన్‌చెరు, రామచంద్రాపురం, జిన్నారం, అమీన్‌పూర్, గుమ్మడిదల మండలాల్లో వెంచర్లు చేసేందుకు బడా రియల్ ఎస్టేట్ సంస్థలు మందుకు వస్తున్నాయి. భూమి అందుబాటులో ఉండటంతో పాటు భూగర్భజలాలు సైతం పెద్ద ఎత్తున ఉండటంతో ఈ ప్రాంతంలో ఇళ్లను నిర్మించేందుకు రియల్ వ్యాపారులు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలుదారుల సైతం ఈ ప్రాంతంలో ఇళ్లు కొనుగోలు చేస్తే రవాణా సౌకర్యంతో విద్య, వైద్య సేవలు అల్లంత దూరంలోనే అందుబాటులో ఉన్నాయన్న భావనతో ముందుకు వస్తున్నారు.

కొత్త పారిశ్రామికవాడలతో బంగారమవుతున్న భూములు

తెలంగాణా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక వాడల ఫలితంగా భూముల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అయితే గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో పెరగడంతో సామాన్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఓఆర్‌ఆర్ జంక్షన్ సుమారు 400ఎకరాల్లో ఏర్పాటు చేసిన వద్ద వైద్యపరికరాల పారిశ్రామిక వాడ పార్కుకు మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవం చేయడంతో చుట్టుపక్కల భూముల ధరలు పెరిగాయి. సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట, గండిగూడ, దాయర, వడక్‌పల్లి, జానకంపేట తదితర గ్రామాల్లో గతంలో ఎకరం రూ. కోటి లోపే ఉండగా తాజాగా రూ. కోటిన్నర నుంచి రూ. రెండున్నరకోట్లు పలుకుతోంది. వైద్యపరికరాల పార్కుకు చుట్టుపక్కల పుట్టగొడుగుల్లా రియల్‌ఎస్టేట్ సంస్థలు వెంచర్లు వేసేందుకు పెద్ద ఎత్తున భూములను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నాయి. జిన్నారం మండల పరిధిలోని శివానగర్‌లో 120ఎకరాల్లో టీఎస్‌ఐఐసీ ఎల్‌ఈడీ పార్కుకు భూసేకరణ చేయడంతో చుట్టుపక్కల కొడకంచి, కంజర్ల, మాదారం, అండూర్ తదితర గ్రామాల్లో భూముల ధరలు పెరిగాయి. ఈ రెండు పారిశ్రామిక వాడల్లో రాబోతున్న పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 50వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇదే అదనుగా రియల్ వ్యాపారులు చుట్టుపక్కల భూములను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఔటర్ మణిహారం చుట్టూ కేంద్రీకృతమైన రియల్‌వ్యాపారం

పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో సుమారు 30కిలోమీటర్లు 8లైన్ల నెహ్రూఔటర్ రింగ్ రోడ్డు విస్తరించి ఉంది. గచ్చిబౌలి, ఫైనాన్సియల్ జిల్లా నుంచి కేవలం 14కిలోమీటర్లదూరంలో కొల్లూరు, నాగులపల్లి, వెలిమెల, పాటి, ఘనాపూర్ తదితర గ్రామాలుండటంతో ఇక్కడ భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. గతేడాది కేవలం రూ. కోటి ధర పలికిన భూములు నేడు రూ. నాలుగు కోట్ల దాకా పలుకుతున్నాయి. దీంతో క్రెడాయ్‌లో సభ్యత్వం ఉన్న రియల్‌ఎస్టేట్ దిగ్గజాలు ఇక్కడ గేటెడ్‌కమ్యూనిటీ వెంచర్లు చేసేందుకు ముందుకు వస్తున్నారు. తాజాగా కొల్లూరులో హైదరాబాద్ నగరంలోని 20వేల మందికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు భూసేకరణ, సాఫ్ట్‌వేర్ పార్కుల అభివృద్ధికి నూతన పారిశ్రామికవాడ ఏర్పాటుకు భూసేకరణ ప్రారంభించడంతో ఎకరం రూ. ఐదు కోట్లు పలుకుతోంది. అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలోని చుట్టు పక్కల గ్రామాలను గ్రేటర్‌లో కలుపుతున్నారన్న ప్రచారంతో ఇక్కడ భూములకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. చుట్టుపక్కల ఉన్న కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ఎకరం రూ. ఐదు కోట్ల దాకా పలుకుతోంది. ఓఆర్‌ఆర్ ముత్తంగి జంక్షన్ వద్ద సైతం భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. జంక్షన్ చుట్టుపక్కల గజం స్థలం గతేడాది కేవలం రూ. ఐదువేలకు మించి పలకలేదు. ప్రస్తుతం రూ. 15వేలు పలుకుతోంది. జంక్షన్ చుట్టుపక్కల ఉన్న ముత్తంగి, చిట్కుల్, పోచారం, గణపతిగూడెం తదితర గ్రామాల్లో సైతం రూ. రెండుకోట్లకు తక్కువ కాకుండా భూముల ధరలు పెరిగాయి.

స్వాతంత్ర్య వేడుకలకు

ఏర్పాట్లు చేయండి

- జిల్లా అధికారులను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్

సంగారెడ్డి టౌన్ : ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, మిషన్ భగీరథ, హరితహారం, బతుకమ్మల చీరల పంపిణీ, రెవెన్యూ భూమి రికార్డుల ప్రక్షాళన తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు జిల్లాలు సాధించిన అభివృద్ధిపై ప్రసంగాలను రూపొందించుకోవాలని సూచించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల చీరలు పంపిణీ చేయనున్నందున గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో నోడల్ అధికారులను గుర్తించి బృందాలను ఏర్పాటు చేసి అర్హులైన మహిళలకు చీరలు పంపిణీ చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని చెప్పారు. ఈ పథకాలపై వచ్చిన దరఖాస్తులకు సంబంధించి తహసీల్దార్లు తనిఖీలను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారంలో భాగంగా జిల్లాలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించి విజయవంతం చేయాలన్నారు. ట్రీగార్డులను దొంగిలించే వారికి జైలు శిక్ష తప్పదన్న విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. అనంతరం సంగారెడ్డి నుంచి జిల్లా కలెక్టర్ మాణిక్కరాజ్ కన్నన్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కల జియో ట్యాగింగ్ 17 శాతం పూర్తిఅయిందని వివరించారు. ఇందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని మొక్కల జియో ట్యాగింగ్‌ను వందశాతం పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు రాథోడ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు తూట్లు !

- చెరువులు, గ్రామ పైపులైన్లలోకి మురుగునీరు
- ఎస్టీపీల ఏర్పాటుకు బిల్డర్ల ఎగనామం
- చిన్నపైపులైన్లపై పెరుగుతున్న ఒత్తిడి
- చెరువులు కలుషితం
- భవన నిర్మాణ నిబంధనలకు పాతర

రామచంద్రాపురం: హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరాల సరసన చేర్చాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతుల విషయంలో పలు మార్పులు తీసుకొచ్చింది. అపార్ట్‌మెంట్లు, విల్లాస్ నిర్మించే బిల్డర్లు విధిగా మరుగు దొడ్ల నీటి శుద్ధీకరణ (ఎస్టీపీ) వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ను ఏర్పాటు చేయాలంటే రూ. కోట్లలో వ్యయం అవుతుందని, ప్లాంట్‌కు విలువైన స్థలాన్ని విడిచిపెట్టాలనే కోణంలో ఆలోచిస్తున్న బిల్డర్లు నిర్మాణాలకు ఎగనామం పెడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో చెరువులు, గ్రామం కోసం ఏర్పాటు చేసుకున్న మురుగునీటి పైపులైన్లలోకి మురుగు నీటి వ్యవస్థను కలిపివేస్తున్నారు. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న రామచంద్రాపురం మండలంలోని తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూరు, వెలిమెల గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వందల ఎకరాల వ్యవసాయభూములను కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు. వీటిలో అపార్ట్‌మెంట్లు, విల్లాలు నిర్మించడానికి హెచ్‌ఎండీఏ నుంచి అనుమతి తీసుకున్నారు. నిర్మాణ అనుమతుల పత్రంలో మురుగునీటిని శుద్ధీకరించే ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు, లేదా మురుగునీటి వ్యవస్థను ఎక్కడ కలుపుతున్నారనే విషయాన్ని స్పష్టంగా పొందుపరుస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఎస్టీపీ వ్యవస్థ ఏర్పాటుకు విశాలమైన స్థలం అవసరం అవుతుంది. సుమారు ఐదు వందల ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఎస్టీపీ నిర్మాణానికి కనీసం రూ. మూడు కోట్ల వరకు వ్యయమవుతుంది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎస్టీపీ నిర్మిస్తే తమ లాభాలు తగ్గుతాయన్న ఆలోచనతో బిల్డర్లు నిర్మాణాలకు తిలోదకాలు పలుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు లోబర్చుకుని మురుగునీటి వ్యవస్థను చెరువులు, గ్రామం కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న మురుగు నీటి కాలువల్లో కలుపడానికి ప్రయత్నిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఐదు, ఆరు వెంచర్లలో మాత్రమే ఎస్టీపీలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చెరువుల పై భాగంలో నిర్మాణ అవుతున్న వెంచర్ల మురుగు నీటి వ్యవస్థను నేరుగా చెరువుల్లో కలుపడానికి కొందరు బిల్డర్లు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు ఆయా గ్రామాల్లోని స్థానిక ప్రజాప్రతినిధులతో బేరసారాలు కుదుర్చుకుంటున్నారని గ్రామాల్లో భారీగానే ఆరోపణలు ఉన్నాయి. మరికొంత మంది బిల్డర్లు గ్రామ అవసరాల కోసం ఏర్పాటు చేసిన మురుగునీటి పైపులైన్లలో తీసుకెళ్లి వెంచర్ల మురుగునీటి వ్యవస్థను కలుపుతున్నారు. తెల్లాపూర్‌లోని ఓ వెంచర్ ప్రతినిధులు గ్రామానికి చెందిన పైపులైన్‌లో మురుగునీటి వ్యవస్థను కలుపడంతో పైపులైన్‌పై ఒత్తిడి పెరిగి, మురుగునీరు రోడ్లపైకి ప్రవహించింది. అప్పట్లో డీపీవో సురేష్‌బాబు సదరు వెంచర్‌కు నోటీసులు జారీ చేశారు. రెండు వేలకు పైగా అపార్ట్‌మెంట్స్ కలిగి ఉన్న నిర్మాణ సంస్థలు కూడ చెరువులు, గ్రామానికి చెందిన చిన్న పైపులైన్లలో మురుగునీటి వ్యవస్థను కలుపడానికి చేస్తున్న ప్రయత్నాలను ఆయా గ్రామంలోని ప్రతిపక్షనాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నిర్మాణ పనులను పర్యవేక్షించే హెచ్‌ఎండీఏ అధికారులు, స్థానిక గ్రామాల కార్యదర్శులు ఎస్టీపీ వ్యవస్థపై దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎస్టీపీవ్యవస్థను ఏర్పాటు వల్ల మురుగునీటిని రీ సైక్లింగ్ చేయవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. మురుగునీరు కలిపే రసాయనాల వల్ల రీ సైక్లింగ్ చేసిన నీటి నుంచి దుర్గంధం రాదని పేర్కొంటున్నారు. ఈ నీటిని మొక్కలకు, మరుగుదొడ్లలో వినియోగించుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు.


ఓ నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసుకున్న ఎస్టీపీ

రుణాల విషయంలో నిర్లక్ష్యం వద్దు

- జాయింట్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్ : రైతులకు పంట రుణాలు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని జాయింట్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక జిల్లా సంప్రదింపులు కమిటీ (స్పెషల్ డీసీసీ) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రుణాలను వెంటనే ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు కేవలం 44.5శాతం పంట రుణాలు మాత్రమే ఇచ్చారన్నారు. ఆగస్టు నెలాఖరుకల్లా వంద శాతం రుణాలను మంజూరు చేయాలని సూచించారు. పంటల రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్లకు వ్యవసాయ శాఖాధికారాలు సహకారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శైలజను ఆదేశించారు. రైతులను భూ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బంది పెట్టకుండా అవసరమైన వివరాలను ఈ-సర్వీసెస్ యాప్ ద్వారా తహసీల్దార్ల నుంచి తెప్పించుకోవచ్చన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో రైతులకు డబ్బు కొరత లేకుండా అన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఇప్పటికే నిర్ణయించినట్లు తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గ శాసన సభ్యుడు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలు సకాలంలో అందక ఇబ్బందులను గురవుతున్నారన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీకాంత్‌రావు, నాబార్డ్ ఏజీఎం రమేశ్‌కుమార్, ఆంధ్రాబ్యాంక్ డీజీఎం వెంకటేశ్వరరావు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

సినిమాలు

పటాన్‌చెరు	
ఎస్‌ఎస్‌వీ	పిదా
రుక్మిణి	గౌతమ్‌నంద
రామచంద్రాపురం	
సంగీత	పిదా
జ్యోతి	పిదా
సదాశివపేట	
జ్యోతి	పిదా
మహేశ్వరి	గౌతమ్‌నంద
బొల్లారం	
జ్యోతి	నక్షత్రం
సంగారెడ్డి	
నటరాజ్	గౌతమ్‌నంద
రుక్మిణి	పిదా
సితార	నక్షత్రం
జోగిపేట	
శ్రీవెంకటేశ్వర	పిదా

గొల్లకుర్మలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర: గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీక్‌మద్దూర్ గ్రామంలో మంగళవారం 30 మంది లబ్ధిదారులకు 630 గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా అన్ని కులాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కోట్లరూపాయల నిధులు వెచ్చిస్తుందన్నారు. గొల్లకుర్మల జీవనాధారమైన గొర్రెల పెంపకంపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రతి గ్రామంలో అర్హులైన వారందరికీ గొర్రెల యూనిట్ పంపిణీ చేస్తుందన్నారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా ప్రజల సమక్షంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామన్నారు. గొర్రెలు పొందిన లబ్ధిదారులు వాటిని సాదుకొని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌యాదవ్‌ను స్థానిక గొల్లకుర్మలు గొంగడి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

చెక్కుల పంపిణీ

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పంపిణీ చేశారు. అదేవిధంగా గోవింద్రాజ్‌పల్లి, సిరిపుర గ్రామాల మీదుగా కొనసాగుతున్న రోడ్డు వెడల్పులో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెక్కులను కూడా ఎమ్మెల్యే అందజేశారు. అంతేకాకుండా పన్యాల, బోర్పట్ల, గుండ్లమాచునూర్, గోవింద్రాజ్‌పల్లి మజీద్‌ల మరమ్మతు కోసం మంజూరైన నిధుల చెక్కులను ఆయా గ్రామాల మైనార్టీ సోదరులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, తహసీల్దార్ ప్రభావతి, ఎంపీడీవో ప్రమీలనాయక్, మధు, ఎంపీటీసీ మేరీ లక్ష్మణ్, నాయకులు నీరుడి అశోక్, చెన్న నర్సింలు, శివశంకర్‌రావు, ఆదిలింగంయాదవ్, రమేశ్ నాయక్, బుచ్చిరెడ్డి, ఎల్లాదాస్, విఠల్‌రెడ్డి, మాణిక్య రెడ్డి, దుర్గంగౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

'పచ్చదనంతోనే మంచి ఆరోగ్యం'

పటాన్‌చెరు రూరల్: పచ్చదనంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం ముత్తంగిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తాటి, ఈత మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటేలా స్థానిక నేతలంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలతో పాటు జడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, ఎంపీపీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గడ్డపోతారంలో రసాయన వ్యర్థాల పారబోత

జిన్నారం: గడ్డపోతారం పారిశ్రామిక వాడలో పరిశ్రమ రసాయన వ్యర్థాల పారబోతపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచ్ ఎంపీ.అశోక్ తెలిపారు. మంగళవారం పారిశ్రామిక వాడలోని ఓ మల్టీనేషనల్ పరిశ్రమ వెనుకాల రసాయన ద్రవ పదార్థాలను పారబోశారని, దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం నెలకొందని, ఈ విషయమై పీసీబీ ఏఈ రవికుమార్‌కు ఫిర్యాదు చేయగా, శాంపిల్స్ సేకరణకు అధికారులను పంపినట్లు అశోక్ తెలిపారు.

'రూ.98 లక్షలతో వినాయక ఘాట్'

రామచంద్రాపురం: పట్టణంలోని రాయసముద్రం చెరువులో రూ.90 లక్షలతో వినాయక ఘాట్‌ను నిర్మిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ రామచంద్రాపురం కార్పొరేటర్ అంజయ్యయాదవ్ తెలిపారు. మంగళవారం ఇరిగేషన్ ఎస్సీ శేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎస్సీ యాదగిరి, ఏఈ శేషగిరితో కలిసి ఘాట్ ఏర్పాటు కోసం స్థలాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే క్రమంలో ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకుండా రాయసముద్రం చెరువుపై వినాయకఘాట్‌ను నిర్మిస్తున్నామన్నారు. బుధవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఘాట్ పనులు ప్రారంభిస్తారని కార్పొరేటర్ పేర్కొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి'

గుమ్మడిదల: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయా లని, మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గిద్దె రాజు పేర్కొన్నారు. మంగళవారం మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు నర్సంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. గ్రామాల్లో పార్టీ బలంగా ఉన్నప్పుడే వచ్చే ఎన్నికల్లో విజయం అందుకోగల్గుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఎస్.వీరారెడ్డి, రాఘవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యాదగిరి, రఘురాం, వెంకట్‌రాం రెడ్డి, కిషోర్, సత్యనారాయణ, రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులతో ఆర్డీవో చర్చలు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి

హత్నూర: మండలంలోని దేవులపల్లి గ్రామ శివారు గుండా తవ్వనున్న మల్లన్నసాగర్ కాలువ భూనిర్వాసితులతో సంగారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి మంగళవారం చర్చించారు. కాల్వలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తరుపున ఎకరాకు 7లక్షల10వేల రూపాయలు చెల్లించేందుకు ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు. తమ భూముల్లో ఇప్పుడు పంటలు వేసినందున ఎకరాకు మరో 10వేల రూపాయలు అదనంగా ఇవ్వాలని రైతులు కోరడంతో ఆయన అంగీకరించారు. అదేవిధంగా కాల్వ తవ్వకాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభావతి, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి'

సంగారెడ్డి అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమ కార్యాచరణ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, అర్జున్, సునీల్, దివాకర్, క్రాంతికుమార్, శశికుమార్, గణేష్, రేణుక పాల్గొన్నారు.

10న టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం

● ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం

జోగిపేట: ఈనెల 10న తిరుమల తిరుపతి దేవస్థానము(టీటీడీ) ఆధ్వర్యంలో జోగిపేట పట్టణంలో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నామని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ డీ.బీ.నాగభూషణం, మాజీ చైర్మన్ గంగ జోగినాథ్ గుప్త, మాజీ ఎంపీపీ హెచ్. రామాగౌడ్, మాజీ ఎంపీటీసీ ఎస్. సురేందర్ గౌడ్ అన్నారు. 10న నిర్వహించబోయే కల్యాణానికి సంబంధించి టీటీడీ రూపొందించిన ప్రచారరథం జోగిపేటకు చేరుకున్నది. మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో ఈ ప్రచార రథాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తిరుమలకు వెళ్లి ప్రత్యక్షంగా దేవదేవుడి కల్యాణంలో పాల్గొనే అవకాశం సామాన్య ప్రజలకు ఎన్నో వ్యయప్రయాసలకు గురిచేసే విషయమన్నారు. అలాంటి కల్యాణాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశ్యంతో టీటీడీ శ్రీనివాసుడి కల్యాణాన్ని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10 గురువారం స్థానిక మార్కెట్ యార్డులో సాయంత్రం 5 గంటలకు ఈకార్యక్రమాన్ని టీటీడీకి చెందిన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు, మాజీ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్ సార్థధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

'ప్రభుత్వ పాఠశాలకు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలి'

జిన్నారం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలని ఎంపీపీ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొడకంచి పరిధిలోని పుట్టుగూడ ప్రభుత్వ పాఠశాలకు పులిగిల్ల ఫౌండేషన్ చైర్మన్ ప్రకాశంవారి టేబుళ్లు, కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంఈవో ప్రకాష్ ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, హెచ్ఎం అనిత తదితరులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షుల ఎన్నిక

జిన్నారం: జిన్నారంలో నిర్వహించిన మండల కాంగ్రెస్ సమావేశంలో వివిధ అనుబంధ సంఘాలకు కమిటీలు వేశారు. మంగళవారం పార్టీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సోషల్ మీడియా చైర్మన్ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో బీసీ సెల్ అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్‌నూర్, ఎస్సీ సెల్‌కి బట్టు చంద్రయ్య, యూత్ కాంగ్రెస్‌కి గాండ్ల శ్రీనివాస్, ఎన్‌ఎస్‌యూఐకి శ్రీకాంత్‌యాదవ్, సేవా దళ్‌కి ఆది ఎల్లయ్య, ఐఎన్‌టీయూసీకి నర్సింగరావు, సోషల్ మీడియాకి కొర్వి ఆంజనేయులు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

తూకం ఈపాస్ మిషన్లు పంపిణీ

వట్‌పల్లి: ఈ పాస్ విధానంతో తూకంలో అవకతవకలకు తావివ్వకుండా రేషన్ వినియోగదారులకు సరుకులను అందించాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వట్‌పల్లి తహసీల్దార్ స్వామి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు తూకం మిషన్లను, ఈ పాస్‌ల మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌లో ఎలాంటి మోసాలు జరగకుండా ఉండేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల నుంచి బయోమెట్రిక్ విధానంతో రేషన్ సరుకులను పంపిణీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాము, సీనియర్ అసిస్టెంట్ అనిల్, వీఆర్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



మిషన్లను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

'డిజైర్ సొసైటీ'లో రాఖీ వేడుకలు

జిన్నారం: బొల్లారం డిజైర్ సొసైటీలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మంగళవారం భారత్ వికాస్ పరిషత్ మహిళా విభాగం ఆధ్వర్యంలో డిజైర్ సొసైటీలోని చిన్నారులకు సంస్థ జాతీయ కార్యదర్శి సురేష్‌జైన్ ఆధ్వర్యంలో రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా చిన్నారులతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో సంస్థ ప్రతినిధులు చింత ప్రకాష్, నిషిత, సుమతిగౌడ్, వీరప్రతాప్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి'

పటాన్‌చెరు రూరల్: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కాసాల బుచ్చిరెడ్డి కోరారు. మంగళవారం మనహూర్ సాయిబాబా మందిరంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌గుప్తా అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానుద్దేశించి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కూడా బీజేపీ పాగా వేయటం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన బీజేపీ రాష్ట్రంలో బలమైన శక్తిగా అవిర్భవించిందన్నారు. గ్రామ గ్రామానా పార్టీ నేతలకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, మహిళా నాయకురాలు గోదావరి అంజిరెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి, చిత్రంలో నందీశ్వర్‌గౌడ్ తదితరులు

ఎర్రర్ ఫ్రీ గ్రామంగా మాసాన్‌పల్లి

జోగిపేట: మండలంలోని మాసాన్‌పల్లిలో రెవెన్యూ పరంగా తప్పులులేని గ్రామం (ఎర్రర్ ఫ్రీ) అని తహసీల్దారు నాగేశ్వర్ రావు అన్నారు. పౌతీ కింద దరఖాస్తు చేసుకున్న భూములకు సంబంధించి పలువురు భూయజమానులకు మంగళవారం ఆయన గ్రామంలోని చావిడి వద్ద నిర్వహించిన గ్రామసభలో పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. రెవెన్యూ పరంగా తప్పులు లేకుండా అన్నింటినీ సరిచేశామన్నారు. పౌతీ కింద దరఖాస్తు చేసుకున్న భూములకు సంబంధించి, గ్రామసభ నిర్ణయం ప్రకారం వారసులకు పట్టాదారు పుస్తకాలను పంపిణీ చేశామని నాగేశ్వర్ రావు అన్నారు.

వృక్షాలకు రక్షా బంధన్



మొక్కలకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కొండాపూర్: తొగర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలకు పాఠశాల విద్యార్థినులు రాఖీలను కట్టారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు వాటికి నీరు పోస్తూ, వాటిని తమ అన్నలుగా భావించి రక్షా బంధన్ సందర్భంగా వాటికి రాఖీలను కట్టి విద్యార్థినులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఎంఈవో బీంసింగ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్

కొండాపూర్: గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా తేర్పోల్ గ్రామానికి చెందిన జిల్లెల యాదగిరిగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ హాజరయ్యారు. జిల్లా గౌడ జన హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షుడిగా అనంతరామ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా దుర్గాగౌడ్, ఆంజనేయులుగౌడ్, కోశాధికారిగా రామ్ చందర్ గౌడ్, కొండాపూర్ అధ్యక్షుడిగా క్రిష్ణాగౌడ్, ఉపాధ్యక్షుడిగా నర్సింలుగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా శివరామ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్‌గౌడ్, ప్రచార కార్యదర్శిగా నగేష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'కోతుల నుంచి కాపాడండి'

కంది: మండలంలోని చిద్రుప్ప, బేగంపేట గ్రామాల్లో నెలకొన్న కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ కార్యదర్శి ఎం.ఎ.ఖాజా మాట్లాడుతూ చిద్రుప్ప , బేగంపేట గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉన్నదన్నారు. గడిచిన ఐదు నెలల్లో గ్రామాల్లోని పంట పొలాలకు నష్టం చేస్తూ రోడ్డుపై వెళ్లే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. సుమారు 400కు పైగా కోతులు సంచరిస్తూ అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, కోతుల భారీ నుంచి రక్షించాలని ఖాజా కోరారు.

'సామాజిక తెలంగాణ కోసం ప్రజలంతా సన్నద్ధం కావాలి'

సంగారెడ్డి అర్బన్: సామాజిక తెలంగాణ కోసం ప్రజలంతా సన్నద్ధం కావాలని టీజేఏసీ జిల్లా కన్వీనర్ బీరయ్య యాదవ్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జయరాజు, పీఆర్‌ఎస్‌ఎస్ జిల్లా చైర్మన్ అనంతయ్య పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చినప్పుడే సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. ప్రైవేట్ సంస్థలతో కుమ్మక్కై ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడాన్ని సహించరాదన్నారు. ఈ నెల 11న సంగారెడ్డిలోని బాలాజీ మంజీర గార్డెన్స్‌లో జరిగే టీమాస్ ఫోరం ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభించిన ప్రధాన న్యాయమూర్తి

సంగారెడ్డి అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులు ఏర్పాటు చేసిన క్రీడలను మంగళవారం సంగారెడ్డిలోని అంబేద్కర్ మైదానంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు మానసికంగా కాకుండా శారీరకంగా, ఉత్సాహంగా ఉండేందుకు క్రీడలు దోహద పడతాయన్నారు. అనంతరం క్రికెట్ బ్యాటింగ్ చేస్తూ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరన్న పాటిల్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రాజు వర్మ, క్రీడల కార్యదర్శి దయాకర్ రెడ్డి, లైబ్రరీ సెక్రటరీ రామారావు, టీం కెప్టెన్స్ విష్ణువర్ధన్‌రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

ప్రజల మౌలిక అవసరాలు తీరుస్తాం

● చైర్‌పర్సన్ పట్నం విజయలక్ష్మి

సదాశివపేట: పట్టణంలో ప్రజల మౌలిక అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ పట్నం విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలో 19వ వార్డులో మున్సిపల్ నిధులు రూ.2లక్షలతో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు కొత్తగా ఏర్పాటు చేసే బోరుబావులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. గడిచిన మూడున్నరేళ్లుగా కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి పట్టణంలోని 23 వార్డుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టమన్నారు. త్వరలో రూ.5 కోట్ల నిధులతో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చీలస్వరూపమల్లన్న, వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



బోరుబావుల పనులు ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

తెలంగాణ భాషను రక్షించుకోవాలి

● ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం

సంగారెడ్డి అర్బన్: ఆధిపత్య భాషల నుంచి తెలంగాణ భాషను రక్షించుకోవాలని ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం సూచించారు. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ భాషపై సంస్కృతం, ఉర్దూ, ఆంగ్లం, సీమాంధ్ర భాషల ఆధిపత్యం కొనసాగుతుందని ఆరోపించారు. నిత్య జీవితంలో జరిగే అన్ని సంఘటనలు నేటి కవిత్వానికి ముడి సరుకు కావాలన్నారు. తెలంగాణలో జాగృతి కృషి అభినందనీయమన్నారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి మాట్లాడుతూ దేశంలో ఎవరూ చేయలేని ప్రయత్నం జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత చేస్తున్నారని పేర్కొన్నారు. 31 జిల్లాలో 31 కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ తెలంగాణ కవుల పునరుత్తేజం కల్పించేలా కృషి చేస్తుందన్నారు. తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మోహన్ రెడ్డి, సాహిత్య విభాగం రాష్ట్ర కన్వీనర్ కాంచనపల్లి గోవర్ధన్, రాష్ట్ర కార్యదర్శులు వేణుగోపాలస్వామి, జిల్లా సాహిత్య విభాగ్ కన్వీనర్ గంగాకాశీనాథ్, యాదవాచార్యులు, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం

యువత మత్తుకు దూరంగా ఉండాలి

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తాడేపల్లి పతంజలి

సదాశివపేట రూరల్: యువత మత్తుకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తాడేపల్లి పతంజలి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం-నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పతంజలి మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి అతి ప్రమాదకరమైన మత్తు పదార్థాలని తెలిపారు. వీటితోపాటు వైన్, గుట్కా వంటివి కూడా శరీరానికి హాని కల్గిస్తాయని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రం, డాక్టర్ లచ్చయ్య విద్యార్థులకు వివరించారు. మత్తు వినియోగం వలన నరాలు, అవయవాలు, సామర్థ్యం కోల్పోయి యువత విచక్షణ కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జగదీశ్వర్, ఎన్‌సీసీ అధికారి గంగాధర్, అధ్యాపకులు సి.జ్యోతి, శ్రీనివాస్, రియాజ్, శివయ్య, మంజుల, మాధవి, కృష్ణప్రియ తదితరులుపాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ పతంజలి

మల్బరీ తెగులు నివారణపై అవగాహన



మొక్కకు మందు వేసి చూపుతున్న అధికారులు

సదాశివపేట రూరల్: మల్బరీ (పట్టు) తోటలో వేరు కుళ్లు తెగులు నివారణపై మంగళవారం సదాశివపేట పట్టణంలో సదాశివపేట, సంగారెడ్డి, కొండాపూర్ రైతులకు ఏడీ లత అవగాహన కల్పించారు. వ్యాధి సోకిన మొక్కలకు ఏ విధంగా ఏమోతాదులో మందును వేయాలో రైతులకు వివరించారు. పట్టు పరిశ్రమలో నూతన సాంకేతిక పద్ధతుల్లో అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తుందని వారు పేర్కొన్నారు. నూతన సాంకేతిక పద్ధతులు అనుసరించి రైతులు అధిక దిగుబడి సాధించడానికి ప్రయత్నించాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి సోమేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ కౌన్సిలర్ జన్మదిన వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న బొంగుల విజయలక్ష్మి, రవి దంపతులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి భర్త, మాజీ కౌన్సిలర్ బొంగుల రవి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు తమ నివాసం వద్ద కేక్‌ను కట్ చేశారు. పలువురు కౌన్సిలర్లు, టీఆర్‌ఎస్ నాయకులు బొంగుల రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రవి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో టీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఆసుపత్రిలోని మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు వైకుంఠపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన చైర్‌పర్సన్ దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా ప్రాంగణంలో గిరిజన బాలికల కళాశాల వసతి గృహం ఏర్పాటు చేసిన నేపథ్యంలో బైపాస్ గుండా సంగారెడ్డి పాత బస్టాండ్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమామహేశ్వర్ రావుకు గిరిజన విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పూల్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ వసతి గృహంలో దాదాపు 150 మంది విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. వసతి గృహం నుంచి కళాశాల వరకు బస్సు సౌకర్యం లేక పోవడంతో కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉదయం 8.40, 9 గంటల మధ్య, అలాగే సాయంత్రం 3.30, 4.30 గంటల మధ్యలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రకాశ్ రాథోడ్, నాయకులు సురేశ్ నాయక్, శ్రీకాంత్, సునీతా పవార్, సుమిత్రాబాయి, గీతా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొండాపూర్: మండల కేంద్రమైన కొండాపూర్‌లోని ఎంఈవో కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బహిరంగ మలవిసర్జన, మన, ద్రవ వ్యర్థాల నిర్వహణ అనే శీర్షికలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.స్వప్న (10వ తరగతి) ప్రథమ స్థానం సాధించగా, కొండాపూర్ కేజీబీవీ శివరాణి (10వ తరగతి) ద్వితీయ స్థానం, మారేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదివే విద్యార్థిని అశ్విని తృతీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బీంసింగ్, ఉపాధ్యాయులు ప్రభు, కవిత, ప్రకాశ్, జ్యోతి రమేశ్, సీఆర్పీలు రమేశ్, నర్సింలు పాల్గొన్నారు.

కంట్రిబ్యూటరీ పెన్షన్‌ను రద్దు చేయాలంటూ ఖేడ్‌లో ఉపాధ్యాయుల ధర్నా



ఎంపీపీ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని నిరసిస్తూ మంగళవారం నారాయణఖేడ్ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంపీపీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాశీనాథ్ జాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏకపక్షంగా 2004 నుంచి కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. దీంతో పదవి విరమణ తర్వాత ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎలాంటి పెన్షన్ అందే సౌకర్యం ఉండదన్నారు. కొన్ని సంవత్సరాల పాటు ఉద్యోగులుగా సేవలు అందించి విరమణ పొందాక ఇతర పనులు చేయలేక, పెన్షన్ పొందలేక మానసిక వేదనకు గురి కావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, టీఎస్‌పీఎస్‌ఈఏ, టీపీయూఎస్, పంచాయతీకార్యదర్శుల బాధ్యులు మడపతి నరేశ్, అశోక్, నర్సింలు, మిస్కిన్, శ్రీనివాస్, జగదీశ్, రతన్‌సింగ్, దత్తురాం, విఠల్ పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకే రేషన్ షాపుల్లో ఆధునిక తూకం యంత్రాలు: తహసీల్దార్

మనూరు: ప్రభుత్వం నిరుపేదలకు కడుపునిండా అన్నం పెట్టలన్న ఉద్దేశ్యంలో ఆహార భద్రతా కార్డులు ఉన్న వారికి రూపాయికి కిలో బియ్యం సబ్సీడీపై గ్రామాల్లో స్థాపించిన చౌక ధర దుకాణాల ద్వారా పంపిణీ చేస్తోంది. చౌక ధర దుకాణాల్లో అవినీతిని నిర్మూలించడానికి ప్రభుత్వం నూతన విధానం ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని 22 రేషన్ దుకాణాల డీలర్లకు ఆధునిక తూకం యంత్రం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి వేలి ముద్రల ద్వారా బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీలర్లు బ్రహ్మండ, సంగయ్య, అశోక్ ఉన్నారు.

మద్యం దుకాణాలపై కేసులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంలోని మద్యం దుకాణాల్లో నిర్ణిత ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని స్థానికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మద్యం దుకాణాలపై దాడులు చేశారని స్థానిక ఎక్సైజ్ ఎస్‌ఐ సూర్యప్రకాశ్ తెలిపారు. స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ ఎస్‌ఐ లింగయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని జైభవానీ, లక్ష్మీనరసింహ, శ్రీసాయి మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించడంతో రాయల్‌స్టాగ్ మద్యంసీసాలను నిర్ణిత ధరల కంటే రూ.10 చొప్పున అధికంగా విక్రయిస్తున్నట్లు తెలియడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖేడ్‌లో ఘనంగా జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ జన్మదిన వేడుకలు



మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న అభిమానులు

నారాయణఖేడ్: జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ జన్మదిన వేడుకలను మంగళవారం నారాయణఖేడ్‌లో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్‌స్వరూప్ షెట్కార్, మాజీ ఎంపీపీ శంకరయ్యస్వామి, కొండల్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు తాహెర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు హన్మంతు, మాజీ ఎంపీటీసీ సాయిలుపటేల్, గుత్తిరమేశ్, నారాయణి శాపింగ్ మాల్ యజమాని అనంతం, దశరత్‌సేట్, మాజీ కోఆప్షన్ సభ్యులు అశ్వాక్ అలీ, హన్మంతప్ప ఉన్నారు.

కమ్యూనిటీ భవనం అర్థాన్నే మార్చేశారు



పశువులను కట్టేయడంతో అధ్వానంగా మారిన బాచేపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ భవనం

కల్హేర్: ఒక సమూహంగా ఏర్పడి సమావేశాలు, కుల సంఘాల మీటింగులు పెట్టుకోవడానికే నిర్మించిన కమ్యూనిటీ భవనం అర్థాన్నే మార్చి వేశారు. మండల పరిధిలోని బాచేపల్లి దళితులు, బాచేపల్లి

• స్టోర్ రూంగా వాడుతున్నారు

గ్రామ ఎస్సీల కోసం సామూహిక భవనాన్ని 2003 సంవత్సరంలో నిర్మించారు. ఈ సామూహిక భవనంలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవాలి కానీ ఇక్కడి కాలనీ వాసులు అందరూ కలిసి పశువులను కట్టేయడం ఒకటైతే లోపల వ్యవసాయ పనిముట్లు, ఉల్లిగడ్డలు, ధాన్యం ఇలా ఒక్కొక్కరూ ఒక రకంగా వస్తువులు పెట్టుకొని సామూహికంగా స్టోర్ రూంగా కమ్యూనిటీ భవనాన్ని వినియోగిస్తున్నారు. కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపై దబాయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీల కొరకు ప్రభుత్వం అనేక రకాలుగా పలు పనులు చేస్తున్నప్పటికీ వారిలో అవగాహనారాహిత్యంతో ఇలా అభివృద్ధి పథకాలు పక్కదారి పడుతున్నాయి. ఎంతో చక్కగా కమ్యూనిటీ భవనాన్ని నిర్వహించుకోవాల్సిన వారే ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఇతరులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు.

ఎంత చెప్పినా వినడం లేదు



సామూహిక భవనంలో వస్తువులు పెట్టకూడదని ఎంత చెప్పినా వినడం లేదు. ప్రభుత్వం ఎస్సీల కోసం సామూహిక భవనం మంజూరు చేసింది. ఇలాంటి అవసరాలకు కాదని చెప్పినా కాలనీ వాసులు వినడం లేదు. అధికారులైనా పట్టించుకొని భవనానికి మరమ్మతులు చేయాలి.

- సాయిలు, కాలనీ వాసి, బాచేపల్లి

ఒంటరి మహిళల పింఛన్లు ఎప్పుడిస్తారు?

• మండల సభలో సభ్యుల ఆగ్రహం

కల్హేర్: గ్రామాల్లో ఎంపిక చేసిన ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు ఇవ్వడం లేదని, అసలు మహిళల జాబితా జిల్లా స్థాయికి పంపక పోవడం కల్హేర్ మండల పరిషత్ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షురాలు జమునా బాయి అధ్యక్షతన కల్హేర్ ఎంపీపీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో ఎంపిక చేసిన ఒంటరి మహిళలకు పింఛన్‌డబ్బు కోసం నిత్యం తమను ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభల్లో ఎంపిక చేసిన జాబితాలు మండల పరిషత్ కార్యాలయానికి పంపించి నెలలు గడుస్తున్నా పింఛన్లు మంజూరు కాక పోవడం విచారకరమని వారన్నారు. దీనికి ఎంపీడీవో స్పందిస్తూ వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. గత సంవత్సరం వేసవి కాలంలో ప్రజలకు నీటి సరఫరా బిల్లులు నేటికీ మంజూరు కాకపోవడం విచారకరమని, దీనిపై ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏఎంసీ చైర్మన్ హన్మంతు స్పందిస్తూ ఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ సమస్య ఉందని రూ.90 లక్షలు, బకాయి ఉందని, వీటి మంజూరు కోసం మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారని, ప్రస్తుతం ఫైలు సీఎం దగ్గర ఉందని తప్పకుండా కొన్ని రోజుల్లో నీటి బిల్లులు మంజూరవుతాయని హామీ ఇచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు అడిగితే వ్యవసాయ సిబ్బంది అందజేయడం లేదని నాగ్‌దర్ ఎంపీటీసీ ఆగ్రహం వ్యక్తం చేసి అధికారుల తీరు సక్రమంగా లేదని అలాంటప్పుడు సమావేశాలెందుకని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఏఎంసీ, ఆత్మచైర్మన్ హన్మంతు, దిలీప్ కుమార్, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు అనసూయ, అంజిరెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బిడెకన్నె హన్మంతు

విద్యార్థులకు తాగునీటి ఇబ్బంది

సిర్గాపూర్: మండల పరిధిలోని వాసర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో మొత్తం 217 విద్యార్థులు ఉన్నారని స్థానికంగా బోరు ఉన్నప్పటికీ అవి తాగడానికి పనికిరావని అన్నారు. గత సంవత్సరం పాఠశాల ఎదుటినుంచే వెళ్లే పైప్ లైన్ ద్వారా కనెక్షన్ తీసుకొనేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ పైప్‌లైన్ వంగ్దాల్ రోడ్డు వద్ద లీకై నీరు రావడం లేదని దీంతో దూరం నుంచి నీరు తేవడంతో ఇబ్బందులు కల్గుతున్నాయని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి విద్యార్థులకు తాగునీరు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల కోరుతున్నారు.

స్వచ్ఛభారత్ వ్యాసరచన పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

కల్హేర్: స్వచ్ఛభారత్ కార్యక్రమంపై మంగళవారం కల్హేర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో ఇద్దరు విద్యార్థినులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో శంకర్ తెలిపారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలన అంశంపై నిర్వహించిన పోటీల్లో కద్పల్ ఉన్నత పాఠశాలకు చెందిన పూజిత, శ్రీలతలు ఎంపికవగా వీరందరికి ఈనెల 10న సంగారెడ్డిలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో శంకర్ తెలిపారు.

బేటీ బచావ్, బేటీ పడావో రాఖీలు కట్టిన చిన్నారులు

కల్హేర్: బేటీ బచావో, బేటీ పడావో అని రాసి ఉన్న రాఖీలను అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు మంగళవారం కల్హేర్ మండల పరిషత్ సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులకు కట్టారు. నారాయణఖేడ్ ఏఎంసీ చైర్మన్ బిడెకన్నె హన్మంతు, ఆత్మ చైర్మన్ దిలీప్‌కుమార్, ఎంపీపీ అధ్యక్షురాలు జమునా బాయి, ఉపాధ్యక్షురాలు అనసూయ అంజిరెడ్డి ఎంపీడీవో ఉమాదేవిలతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులకు చిన్నారులు రాఖీలు కట్టి ఆడపిల్లలను ఆదరించాలనే నినాదాన్ని వినిపించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, జమున, కార్యకర్తలు సునీత, స్వప్న, లక్ష్మి, పాల్గొన్నారు.

నీటిఎద్దడి తీర్చాలంటూ మండల పరిషత్ ముట్టడి



కంగ్టిలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించిన నాగూర్(కె) గ్రామస్థులు

కంగ్టి: తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మంగళవారం మండల పరిధిలోని నాగూర్ (కె) గ్రామస్థులు కంగ్టి మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. నాలుగు నెలలుగా గ్రామానికి నాబార్డు నీరు సరఫరా కావడం లేదన్నారు. ఈ విషయాన్ని ఇటీవల అధికారులకు తెల్పినా పట్టించుకోవడం లేదన్నారు. మధ్యాహ్నం 12 గంటలైనా ఎంపీడీవో కార్యాలయానికి రాకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్ సైతం నెలల తరబడి గ్రామం వైపు చూడడం లేదన్నారు. దీంతో తమగోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోయారు. అధికారులు గ్రామానికి రారు మేము కార్యాలయానికి వస్తే ఇక్కడ కూడా అందుబాటులో ఉండడం లేదని అసహనం వ్యక్తం చేశారు. నాబార్డు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించడంలో కాంట్రాక్టర్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తక్షణమే సమస్య పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంగప్ప, గుండప్ప, శ్రీకాంత్, రాజు, వీర్‌శెట్టి, ధన్‌రాజ్, గణపతి, నర్సప్ప, స్వామి పాల్గొన్నారు.

జహీరాబాద్ సినిమాలు

మోహన్	ఫిదా
సినీమ్యాక్స్	నక్షత్రం
అనురాగ్	గౌతంనంద



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

'లక్ష్యాన్ని ఛేదిద్దాం'

కోహీర్: హరితహారం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో మొక్కలను నాటి ఇచ్చిన లక్ష్యాన్ని ఛేదిద్దామని ఉపాధిహామీ ఏపీవో మాణిక్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లకు, మొక్కల నిర్వాహకులకు నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇప్పటి వరకు నాటిన మొక్కలను కాపాడాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని ఆయన సూచించారు. అన్ని గ్రామాల్లో 40వేల మొక్కలు నాటేందుకు కృషి చేయాలన్నారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని పైడిగుమ్మల్ గ్రామంలో గల నర్సరీని ఎంపీడీవో భిక్షపతి పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులు మొక్కలు పెరిగేంత వరకు ఎండిపోకుండా జాగ్రత్త తీసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు

● జిల్లా సహకార సంఘ అధికారి రాములు



గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘం అధికారి రాములు

కోహీర్: హరితహారం కార్యక్రమంలో భాగంగా 65వ జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటడం జరుగుతుందని జిల్లా సహకార సంఘం అధికారి రాములు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కోహీర్, జహీరాబాద్ మండలాల మీదుగా ఉన్న జాతీయ రహదారికి ఇరువైపుల మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మరో మూడు రోజుల్లో రోడ్డుకు ఇరువైపుల గుంతలను తీసి పెద్దఎత్తున ఒకేరోజు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రోడ్డు విస్తీర్ణం పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలిగించడంతో కాలుష్యం అధికంగా పెరుగుతుందన్నారు. కాలుష్య నివారణకు ఖచ్చితంగా ప్రతి ఒక్కరు తమ సహకారాన్ని అందించి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఆయన వెంట కోఆపరేటివ్ సొసైటీ అధికారి చిన్నారావు, గ్రామ సర్పంచ్ రాందాస్, వీఆర్వో సంగ్రాం ఉన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సహాయం

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురైన కమ్రోద్దీన్ మెరుగైన చికిత్స కోసం ఆదుకోవాలని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావుకు విన్నవించారు. ఆయన స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు వీలుగా ఇటీవల జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా లక్ష రూపాయల నగదును అందజేశారు. దీంతో పాటు ఆస్పత్రి వర్గాలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50లక్షల ఎల్వోసీని అందజేశారు.

మామిడి మొక్కల పంపిణీ

ఝరాసంగం: మండల పరిధిలోని బర్దీపూర్, కక్కరవాడ గ్రామాల్లో మంగళవారం ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాల్లోని సభ్యులకు మామిడి మొక్కలను సర్పంచులు జ్యోతివేణుగోపాల్‌రెడ్డి, బోజిరెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాక్రాంతి పథం ద్వారా మహిళా సంఘాల్లి ఒక్కొక్క సభ్యురాలుకు ఒక్కొక్క మొక్క అందజేయడం జరిగిందన్నారు. ఈ మొక్కలను సభ్యులు ఇళ్ల ఆవరణలో నాటుకుని సంరక్షించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు.

వాహనదారులకు తప్పని తంటాలు



కుప్పానగర్ పెట్రోల్ బంక్ వద్ద ఒక వైపు తవ్విన ఆర్‌అండ్‌బీ రోడ్డు

● రోడ్డు పనులు సరే-రేడియం మార్క్ ఎక్కడ?

● రాత్రి వేళలో అదుపు తప్పుతున్న వాహనాలు

ఝరాసంగం: రోడ్లపై గుంతలు ఏర్పడితే, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోకుండా రోడ్డు పనులను చేయిస్తారు. రోడ్డు పనులు చేయడంతో వాహనచోదకుల ఇబ్బందులు తీరుతాయి. కాని రోడ్డు పనులు చేపట్టేటప్పుడు కాంట్రాక్టర్లు వాహనచోదకులు ప్రమాదాలకు గురికాకుండా పనులు జరిగే చోట రేడియం మార్క్‌తో కూడిన సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి. అధికారుల పర్యవేక్షణలోపం, కాంట్రాక్టర్ అశ్రద్ధకారణంగా రోడ్డు పనులు చేసే వద్ద రేడియం మార్క్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల మేర 1.20కోట్ల రూపాయల వ్యయంతో ఆర్‌అండ్‌బి రోడ్డు పనులను చేపడుతున్నారు.

ఇదే నిధులతో జహీరాబాద్ నుంచి పస్తాపూర్ వరకు రెండు కిలోమీటర్ల వరకు పనులు చేయాల్సి ఉంది. మొదట కుప్పానగర్ నుంచి రోడ్డు పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. రోడ్డుకు ఒక వైపు పూర్తిగా తవ్వి పనులను నిర్వహిస్తున్నారు. పనులు చేసే చోట రేడియం మార్క్‌ను ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు, మూడు రోజుల నుంచి జహీరాబాద్ నుంచి పనులను ముగించుకుని ఝరాసంగం, రాయికోడ్, ఇతర గ్రామాలకు వెళ్లే వాహనచోదకులు తవ్విన రోడ్డు కనిపించకపోవడంతో ఒకేసారి వాహనం అదుపుతప్పడంతో భయందోళనకు గురవుతున్నామని ఆయా గ్రామాల వాహనదారులు వాపోయారు. అంతేకాకుండా రోడ్డును ఒక వైపు పూర్తిగా తవ్వడంతో పెద్ద వాహనాలు వెళ్తే కళ్లలోకి దుమ్ము దూళి చేరడంతో ముందు నుంచి వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రేడియం మార్క్‌ను ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలిగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



కుప్పానగర్ నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు చేసే దగ్గర రేడియం మార్క్‌ను ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో తవ్విన రోడ్డు కనిపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు ఎక్కడ తవ్వారో తెలియని పరిస్థితి ఉంది. రోడ్డు తవ్వడంతో పెద్ద వాహనాల వెనుక నుంచి దుమ్ము, దూళి ఎక్కువగా వచ్చి కళ్లలో పడడంతో ఇబ్బందులు పడుతున్నాం.

\- వీరన్న, బోరెగావ్

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు

జహీరాబాద్: జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌శెట్కార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జన్మదిన కేక్‌ను కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ఎంపీ సురేశ్‌కుమార్‌శెట్కార్ మున్ముందు ఇలాంటి జన్మదినాలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తాహేరాబేగం, శేఖర్, నారాయణరెడ్డి, డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శివాజీపాటిల్, నాయకులు భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, నాగేశ్, జాఫర్, మల్లు, జహీర్, పాండురంగారెడ్డి, తలీం, మోసిన్, రవి, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో

న్యాల్‌కల్: మండలంలోని వడ్డి గ్రామంలో మంగళవారం జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌శెట్కార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ జడ్పీటీసీ శివాజీరావు పాటిల్, డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డిలు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జన్మదిన కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శాంత్‌కుమార్‌పాటిల్, ఎ.విఠల్‌రెడ్డి, భద్రుస్వామి, తిరుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, వడ్డిరవి, సునీల్, కిష్టాగౌడ్, బందెలి, నాగుల్‌గౌడ్, యాదుల్‌పాషా, రమేశ్ పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెవెన్యూ సర్వేతో భూసమస్యల పరిష్కారం

జహీరాబాద్: గ్రామాల్లో భూసమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ దశరథ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నహైదరాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జహీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు విడతలుగా రెవెన్యూ సిబ్బంది ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అప్పట్లో రైతుల నుంచి సేకరించిన ఫిర్యాదులను ఒక్కొక్కటిగా పరిష్కరించడమైందన్నారు. సమస్యలు పరిష్కారమైన గ్రామాల్లో రైతులకు నేరుగా తప్పులను సవరిస్తూ ప్రొసీడింగ్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా మూడో విడత ఇంటింటి సర్వే కార్యక్రమం కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు గ్రామప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ షఫీ, వీఆర్వో మల్లేశం, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'యువత సామాజిక సేవలో పాల్గొనాలి'



ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న యువజన సంఘం సభ్యులు

రాయికోడ్: యువత సామాజిక సేవలో చురుకుగా పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మండల యువజన సంఘాల అధ్యక్షుడు బి.నర్సింలు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల చుట్టు పక్కల పెరిగిన పిచ్చి మొక్కలను యువజన సంఘాల సభ్యులు తొలగించి శుభ్రం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివివేకానంద చూయించిన మార్గంలో నడిచి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బి.నవీన్‌కుమార్, అంజయ్య, పాండు, శ్రీనివాస్‌రెడ్డి, సంగమేశ్వర్, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుప్పట్లు, ప్లేట్ల పంపిణీ

ఝరాసంగం: మండల కేంద్రమైన ఝరాసంగంలోని కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం విద్యార్థినులకు పాఠశాల ప్రిన్సిపాల్ విక్టోరియారాణి దుప్పట్లు, ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా విద్యార్థినులకు దుప్పట్లు, ప్లేట్లు అందజేయడం జరిగిందన్నారు.

లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియం కామర్స్, హిస్టరీ పాఠ్యాంశాలను బోధించేందుకు గాను తాత్కాలిక పద్ధతిన లెక్చరర్ల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాజు తెలిపారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే ఆసక్తి గల అభ్యర్థులు మరిన్నీ వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.


'ప్రభుత్వం మభ్యపెడుతోంది'

జహీరాబాద్: అధికారంలో కొనసాగుతున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మాయమాటలతో మభ్యపెడుతుందని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు సతీష్ అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని రహదారుల భవనంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సతీశ్, అఫ్జల్, శంకర్, అఫ్సర్‌పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన

కోహీర్: కోహీర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తట్టురుబెల్లా వ్యాక్సిన్‌పై డాక్టర్ శ్రీధర్ మహిళా సంఘాల సభ్యులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. 9నెలల నుంచి 15సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ త్వరలో ప్రారంభించనున్న ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయించాలని ఆయన కోరారు.

మీజిల్స్, రూబెల్లా... ప్రాణాంతకం



- ఈ నెల 17 నుంచి టీకాలు
- 9 నెలల నుంచి 15 ఏళ్ల పిల్లలకు తప్పనిసరి

కొండపాక: పిల్లలు రోగాల బారిన పడకుండా ముందస్తుగా టీకాలు వేయించాలి. బిడ్డ పుట్టిన వెంటనే వ్యాధినిరోధక శక్తి మందులతోపాటు, ఇతర వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్లు, ఇంజక్షన్లు వేయిస్తుంటారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పలు కార్యక్రమాలు అమలుచేస్తున్నది. పిల్లలకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉండడానికి వాక్సిన్‌ను అందివ్వబోతుంది.

వ్యాధుల కాలం


ఇది వర్షాకాలం అంటే వ్యాధుల కాలం. కొత్త నీరు రావడం, వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల వ్యాధులు సోకే ప్రమాదముంది. జలుబు, దగ్గు, ఆయాసం, తలనొప్పితో కూడిన జ్వరాలు సోకే ఈ సీజన్‌లో వాటి నుంచి రక్షణ పొందాలంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరగాలి. అందుకు యాంటి బయోటిక్ టీకాలు వేయించుకోవాలి. మీజిల్స్(తట్టు), రూబెల్లా వైరస్ వల్ల దేశంలో ఏటా దాదాపు 49 వేల మంది చిన్నారులు చనిపోతున్నట్లు ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. పిల్లలను ఆరోగ్యవంతులుగా చేయాలని, అవి సోకకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంఆర్ టీకా అందిస్తున్నది.

మీజిల్స్, రూబెల్లాతో వచ్చే వ్యాధులు

మీజిల్స్, రూబెల్లా ప్రాణాంతకమైన వ్యాధులు చిన్నారుల్లో వైకల్యాలు, మరణాలకు కూడా దారితీస్తాయి. ప్రధానంగా దగ్గడం, తుమ్మడం వల్ల వచ్చే తుంపరలతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. తట్టు సోకిన వారికి దద్దుర్లు కనబడటానికి ముందు నాలుగు రోజుల నుంచి దద్దుర్లు తగ్గిన తర్వాత 4 రోజులు తర్వాత సంబంధిత వ్యక్తి నుంచి ఇతరులకు వ్యాపిస్తుంది. అతిసారం, నిమోనియా, నోటిపూత, చెవి ఇన్ఫెక్షన్, కళ్లు దెబ్బతినడం వంటి సమస్యలు రావచ్చు. ఇది కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారి తీయవచ్చు. గర్భిణీగా ఉన్నపుడు కలిగే రూబెల్లా ఇన్ఫెక్షన్‌తో గర్భం కోల్పోవడం లేదా మృతశిశువు జన్మించడం జరగవచ్చు. ఇమ్యూనైజేషన్ పొందని చిన్నారులకు మీజిల్స్, రూబెల్లా ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఎక్కువ.

ఎంఆర్ టీకాతో రక్షణ

ఈ వైరస్ సోకకుండా ఉండడానికి ఏకైక మార్గం వ్యాక్సినేషన్ చేయించుకోవడం. 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ టీకా వేయింయచాలి. ఈ నెల 17 నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఏరియా ఆస్పత్రిల్లో, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో, పాఠశాలల్లో ఇస్తారు. గతంలో వ్యాక్సిన్ వేయించుకున్న చిన్నారులకు కూడా ఈ టీకాను మళ్లీ వేస్తారు. ఇది చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. టీకాను వేయడానికి ప్రభుత్వం, వైద్యశాఖ సర్వం సిద్ధం చేసింది.







విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ఎవరెవరు వేయించుకోవాలి ?

పోషకాహార లోపం ఉన్న చిన్నారుల్లో అతిసారం, నిమోనియా వంటి రోగాలు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంది. వీరికి అధిక ప్రాధాన్యాన్నిచ్చి ఈ టీకా వేయాలి. తేలిక పాటి శ్వాస సంబంధిత ఇబ్బందులు అతిసారం, తక్కువ జ్వరం వంటి చిన్న చిన్న అస్వస్థతలు కలిగిన చిన్నారులకు కూడా ఈ టీకాను వేయించవచ్చు.

ఎవరికి వేయించకూడదు

అధిక జ్వరం, ఇతర తీవ్రమైన వ్యాధులు ఉదాహరణకు అపస్మారక స్థితిలో ఉండడం, ఆస్పత్రిలో వివిధ రుగ్మతలతో చేరిన చిన్నారులు, గతంలో ఈ టీకాతో తీవ్రమైన అలర్జీ లేదా ప్రతిచర్యకు లోనైనవారికి ఇవ్వరాదు.

15 సంవత్సరాల లోపు వారికే ఎందుకు

పదిహేను సంవత్సరాల లోపు వయసు ఉన్న చిన్నారుల్లో ఈ వైరస్ సోకిన కేసులు అధికంగా ఉంటాయి. ఈ కారణంగా ప్రభుత్వం ఆ వయసు వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి వారినే లక్ష్యంగా ఎంచుకుంది.

పాఠశాలల భాగస్వామ్యం

పదిహేను సంవత్సరాలలోపువారు ఎక్కువశాతం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటారు. అందుకే పాఠశాలల భాగస్వామ్యం తీసుకుంటున్నారు. అందుకు ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కూడా ఇచ్చారు. పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి ఈ టీకా గురించి వివరిస్తూ వేయించాలని సూచిస్తున్నారు.

పిల్లల ఆరోగ్యమే మా బాధ్యత



పిల్లలు ఆరోగ్యంగా ఉంచేందుకు ఆరోగ్యశాఖ పని చేస్తున్నది. పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు మీజిల్, రూబెల్లా వాక్సిన్ ఎంతో దోహదపడుతుంది. 9 నెలల వయసు నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికీ వ్యాక్సిన్ అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉందన్నారు. ఈ వ్యాక్సిన్‌పై ఎలాటి అపోహలు పెట్టుకోవద్దు.

- మహమ్మద్ జాకీర్ హుస్సేన్, మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం



ప్రాణాంతక వ్యాధులైన మీజిల్ రూబెల్లా నివారణకు టీకా మందుపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రజల్లో చైతన్యం కల్పిసున్నాం. 15 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఈ టీకా తప్పకుండా వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. టీకా జీవితకాలం పనిచేస్తుంది.

- ఎ.శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఈవో , నంగునూరు

నైపుణ్యం సాధిస్తేనే భవిష్యత్తు

పటాన్‌చెరు రూరల్: నైపుణ్యంతో మంచి ఉద్యోగం పొందవచ్చని, నైపుణ్యమే బంగారు భవితకు బాట అని గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శివప్రసాద్ అన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, టెక్ ట్రంక్ వెంచర్స్ సౌజన్యంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్‌పై నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రో వీసీ మాట్లాడుతూ పరిశ్రమలో మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయని, ఆ మార్పులను విద్యార్థులు అవగతం చేసుకుని వృత్తినిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కొత్త విషయాలను ఇష్టంతో కష్టపడి నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్న టెక్ ట్రంక్ వెంచర్స్ సాంకేతిక నిపుణుడు అన్షు పాండే మాట్లాడుతూ కృత్రిమ మేథపై నైపుణ్యం సాధిస్తే ఉద్యోగ అవకాశాలుంటాయని అన్నారు. కృత్రిమ మేథస్సుతో రోబోలకు రూపకల్పన చేస్తున్న దశలో కార్యశాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం ముదావహమని, ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంజయ్ సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరయ్య అతిథులను స్వాగతించగా, కార్యశాల సమన్వయకర్త కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శివప్రసాద్

ఇప్పుడూ మామిడి తినొచ్చు



వర్షాకాలంలో మామిడి కాయలు విక్రయించడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా.? అవును... సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మంగళవారం నిర్వహించిన సంతలో చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన మణెమ్మ మామిడి కాయలను విక్రయించారు. మామిడి కాయలు ఎండాకాలంలోనే లభిస్తాయి. చివరగా జూన్ వరకు కూడా మార్కెట్లో అందుబాటులో ఉంటాయి. కానీ వర్షాకాలంలో మామిడి కాయలు విక్రయించడానికి రావడంతో జనాలు వాటిని ఆసక్తితో కొనుగోలు చేశారు. సాధారణంగా సీజన్‌లో మామిడి కాయలను రూ.5కు ఒకటి చొప్పున విక్రయించినప్పటికీ ప్రస్తుతం రూ.10కి ఒకటి చొప్పున విక్రయించారు. ఈ విషయమై మామిడి కాయలను విక్రయిస్తున్న మణెమ్మను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా జహీరాబాద్ సమీపంలోని కోహీర్‌లో మామిడి కాయలు లభించడంతో అక్కడి నుంచి కొనుగోలు చేసి విక్రయించడానికి తీసుకువచ్చానని తెలిపారు.

- నారాయణఖేడ్



చీకట్లోనే మార్కెట్

దళారులుండరు... అమ్మకాల్లో రైతులే రాజులు

• తూప్రాన్ పట్టణంలో అర్ధరాత్రి నిర్వహణ • సస్తా ధరల్లో కూరగాయలు

మార్కెట్, సంత, అంగడి పేరేదైనా సరుకులన్నీ ఒకేచోటా సస్తాగా లభించే చోటు. కూలీలు, పేదలు వారంలో ఓ రోజు జరిగే అంగట్లోనే సరకులు కొంటుంటారు. ఈ మార్కెట్లన్నీ ఉదయం నుంచి సాయంత్రం చీకటి వరకే నిర్వహిస్తారు. రాత్రయ్యిందంటే కొనుగోళ్లుండవు. కానీ తూప్రాన్ పట్టణంలో మార్కెట్ రాత్రుల్లోనే సాగుతుంది. అమ్మకందారులు, కొనుగోలుదారులు రాత్రుల్లోనే మార్కెట్‌కొచ్చి కొనుగోళ్లు, అమ్మకాలు చేస్తుంటారు. మార్కెట్ ధరలను బట్టి రైతులు ధర ప్రకటిస్తే, బేరమాడి కొనుగోలు చేస్తుంటారు. కొనుగోలు, అమ్మకాల్లో దళారులు లేకుండానే మార్కెట్ కొనుగోళ్లు సాగుతున్నాయి. కొనుగోళ్లకు హైదరాబాద్, కామారెడ్డి నుంచి వ్యాపారులు వస్తుంటారు. ఈ వింతైన రాత్రి మార్కెట్ మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో నిత్యం జరుగుతుంది.

చీకట్లో మార్కెట్ అనగానే ఏదో గుట్టుగా సాగే తప్పుడు దందా కాదండోయ్.. తూప్రాన్ పట్టణంలో అర్ధరాత్రి రైతులే నిర్వహించే కూరగాయల మార్కెట్ ఇక్కడ అన్నీ సస్తా అనేది ఇక్కడికొచ్చే కొనుగోలు దారుల అభిప్రాయం.

- తూప్రాన్



తూప్రాన్ మండలంలో రైతులు భారీగా కూరగాయల సాగు చేపడుతుంటారు. రైతులు పండించిన కూరగాయలను ఎర్రగడ్డ మార్కెట్‌కు ఎక్కువగా తీసుకెళ్తుంటారు. ఎర్రగడ్డ మార్కెట్‌లో ఈ ప్రాంత రైతులు చాలా మంది గుర్తింపుకార్డులతో అమ్మకాలు సైతం చేస్తుంటారు. ఎర్రగడ్డకు తీసుకెళ్లలేని రైతుల ఇక్కడి క్కడే అమ్మకాలు చేస్తుంటారు. ఇక్కడిక్కడే అమ్మకాలు చేసేందుకు పట్టణంలోనే రాత్రుళ్లలో జరిగే ఓ మార్కెట్ ఉంది. ఈ మార్కెట్ అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉ. 5 గంటల వరకు సాగుతుంది. హైదరాబాద్ పాతసిటీలో నిర్వహించే జుమ్మేరాత్ బజారు లాగే ఉంటుంది. ఆ మార్కెట్ గురువారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే వారంలో ఒకేరోజు సాగుతుంది. కానీ, తూప్రాన్ మార్కెట్ నిత్యం అర్ధరాత్రుల్లో స్ట్రీట్‌లైట్ల వెలుతురులో సాగిస్తుంటారు. పట్టణంలో హైవేకు ఒక వైపు కూరగాయాల మార్కెట్ నిర్వహిస్తుంటారు. రైతులు అర్ధరాత్రి నుంచే రైతులు తాము పండించిన కూరగాయాలను ఆటోరిక్షాలు, మోటారు సైకిళ్లు, సైకిళ్లపై తూప్రాన్‌కు తీసుకొస్తారు. వ్యాపారులు సైతం అర్ధరాత్రే వచ్చ ఇక్కడ కొనుగోళ్లు చేస్తుంటారు. చుట్టు పక్క ఎవరింట్లో పెళ్లిళ్లయినా ఇక్కడినుంచే కూరగాయలు తీసుకెళ్తుంటారు. అంతేకాదు అనేక శుభకార్యాలకు హోటళ్లకు, చిరువ్యాపారులు ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. పట్టణంలో కూరగాయాల వ్యాపారం చేసుకునే వారందరూ రాత్రుల్లో విచ్చేసి కొనుగోలు చేసి ఉదయం అమ్మకాలు చేసుకుంటుంటారు. మార్కెట్ డిమాండ్‌ను బట్టి కూరగాయల రేట్లుంటాయి. రైతు తాను పండించిన కూరగాయలను తనకిష్టమొచ్చిన మార్కెట్ ధరకు అమ్ముకునే మార్కెట్ ఇదొక్కటే. ఏవైనా కూరగాయాలు తక్కువగా మార్కెట్‌కు వస్తే డిమాండ్ అధి కంగా ఉంటుంది. దళారుల్లేకుండా రైతులే అమ్మకాలు చేపట్టి, నగదు తీసుకెళ్తుంటారు. మార్కెట్ డిమాండున్న కూరగాయాలను రైతు తెస్తే ఎగబడి కొనుగోలు చేయడంతోపాటు, రైతును ఉక్కిబిక్కిరి చేస్తుంటారు. రైతు కొంచెం జాగ్రత్త వహిస్తే రాత్రి మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకోవచ్చు. ఈ రాత్రి మార్కెట్‌లో మేడ్చల్, మనోహరాబాద్, శివ్వంపేట, చేగుంట, చిన్నశంకరంపేట, నార్సింగి, రామాయంపేట, కామారెడ్డి ప్రాంతాల నుంచి విచ్చేసి కొనుగోలు చేస్తుంటారు. రాత్రి మార్కెట్ చూడాలంటే తూప్రాన్ పట్టణానికి విచ్చేసి ఓ లుక్కేయాల్సిందే.





శ్రీహరి కల్యాణం చూతము రారండి



• నేడు మెదక్‌లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం
• ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఏర్పాట్లు
• పార్టీలకతీతంగా శ్రీనివాస కల్యాణంలో పాల్గొనాలి: నిర్వాహకులు

మెదక్ అర్బన్: వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం బుధవారం మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వైభవంగా నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీనివాస కల్యాణ మహోత్సవం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానుంది. ఇప్పటికే వెంకన్న కల్యాణ మహోత్సవానికి తితిదే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మెదక్‌జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న వేంకటేశ్వర కల్యాణానికి పెద్దఎత్తున భక్తులు హాజరవనున్నారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. కన్నుల పండువగా నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు మెదక్ జిల్లాలోని శ్రీవారి భక్తులు పాల్గొని కల్యాణమహోత్సవాన్ని తిలకించాలని నిర్వాహకులు కోరారు. శ్రీవారి కల్యాణమహోత్సవానికి ఉచిత ప్రవేశం, తీర్థప్రసాదాలు కూడా ఉచితంగా అందజేయనున్నట్లు వారు తెలిపారు. తిరుమల నుంచి వేదపండిత బృందాలు, అర్చక స్వాములు మెదక్‌కు చేరుకున్నారు. వేద మంత్రోచ్ఛారణలతో పాటు శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన అన్నమయ్య సంకీర్తనలను నిర్వహించారు. తిరుమల ఆనంద నిలయంలో శ్రీవారి కల్యాణం ఏవైనంలో జరుగుతుందో అదే విధంగా మెదక్‌లోనూ జరగనుంది.



విలేకరులతో మాట్లాడుతున్న నిర్వాహకులు

పార్టీలకతీతంగా హాజరు కావాలి

రెండేళ్ల క్రితం మెదక్‌లో శ్రీనివాస కల్యాణం నిర్వహించాలని టీటీడీకి దరఖాస్తు చేశామని, అంతేకాకుండా ఈ విషయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని నిర్వాహకులు తెలిపారు. చంద్రబాబు ఆదేశంతో ఈ కల్యాణమహోత్సవ కార్యక్రమాన్ని మెదక్ జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించారు. బుధవారం నిర్వహించనున్న కల్యాణమహోత్సవానికి పార్టీలకతీతంగా అందరూ హాజరు కావాలని వారు తెలిపారు. స్వామివారి కల్యాణంలో పాల్గొని ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు ప్రముఖ సిద్ధాంతి శాస్త్రుల కృష్ణమూర్తి, బట్టి జగపతి, కొండని సురేందర్‌గౌడ్, గంజి శ్రీనివాస్, వినోద్, వెంకటేశం, మచ్చేందర్‌నాథ్ కోరారు.

కలియుగ ప్రత్యక్ష దైవం

